# సమర్థ సద్గురు

నవంబర్ 2025

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00



## ఆగష్టు 30 నుండి సెప్టెంబరు 1 వరకు కట్టమూరు గ్రామములో జరిగిన సత్సంగ కార్యక్రమ దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 3
పేజీలు 44
నవంబర్ 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
మందస్మిత ప్రభాపూర మజ్జత్కామేశ మానసా . .......9
గురువనగ బ్రహ్మవస్తువు......... ......................12
మాతాజీ బోధ .................................. ............14
భగవద్గీత సాధన దీపిక ...............................16
నరసింహ మెహతా... ................................ ..................18
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ....... 20
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 22
నారద భక్తి సూత్రములు ............... ..............24
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....26
చంద్రోదయం............ ......................................27
శ్రీ బాబూజీతో నా ప్రయాణం .................28
నిరీక్షణ ..................................................................30
శ్రీ గురుగీత ........................................... ........34
రాధ - దుర్గ ................................................ 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

6. *చచ్చాకేమొచ్చు ఎత్తిపోతలు గాక*
*బొంది జీవముండగనె మోక్షంబు*
*బొందవలయు జ్వరము మాడ్కి*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: కొంతమంది మోక్షం అంటే అదేదో చనిపోయాక పొందేది అనుకుంటారు. చనిపోయాక ఎత్తిపోతలు తప్ప ఏమీ మిగలదు. బ్రతికి ఉండగానే నీ శరీరం మీద జ్వరాన్ని ఎలా అనుభవిస్తున్నావో మోక్షస్థితిని కూడా అలాగే అనుభవించాలి.



1) శ్రీకృష్ణుడు వర్తకుని రూపంలో వచ్చి ఎవరికి ఖరీదైన వస్తువులను అందజేసాడు?
2) నిజమైన ప్రేమను అనుభవించాలంటే ఏ దేవి అనుగ్రహం కావాలి? ఆ ప్రేమను కాపాడుకోవాలంటే ఏ దేవి అనుగ్రహం కావాలి?
3) ఆవరణ దోషం ఎలా తొలగుతుంది?
4) దేవుడు పసిపాప వద్ద పళ్ళు మాత్రమే ఎందుకు తీసుకున్నాడు?
5) సద్గురువులు అనేక కర్మలు చేస్తున్నట్లుగా కనిపించినా అవి వారిని ఎందుకు బంధించవు?
6) భగవానుడు నాతోనే స్వేచ్ఛగా సంచరిస్తున్నారు అనుకోవడంలో తప్పేమిటి?
7) పరమేశ్వరుని చూసి జగన్మాత ఎందుకు నవ్వింది?
8) భాగవతంలో ఏఏ స్కంధాలను పోతనగారు తెనిగించారు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

## **శ్రీ బాబూజీ ఉవాచ** - కీ.శే. పరాశర ప్రసాద్

17-9-1981

ఈరోజు రాత్రి 9గం॥లకు శ్రీ బాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'ఆ మధ్య న్యూస్‌పేపర్లో రామాయణ సంఘటన సుమారు 5000 వేల సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనగా వ్రాయబడింది. జాబాలి గురించి కూడా వ్రాయబడింది. మరి దానిమీద మీ అభిప్రాయం ఏమిటండీ?' అని పురుషోత్తంగారిని ప్రశ్నించారు.



పురుషోత్తం గారు ఏమీ చెప్పలేక పోయారు. శ్రీబాబు కల్పించుకొని 'అటువంటివి చదవటం వలన మనస్సు చెదిరిపోతుంది. పైకి విసిరిన రాయి భూమ్యాకర్షణ శక్తి చేత క్రిందికి గుంజబడుతుంది. అలాగే మనస్సు ఎంత ప్రయత్నం చేసినా సంకల్పముల వైపుకు గుంజబడుతుంది. మీరు జాబాలి చరిత్ర చదివారనుకుంటాను. జాబాలి మహర్షి. శ్రీరామచంద్రుడంటే అమిత భక్తి. ప్రజలు శ్రీరామచంద్రుని పరిపాలనే వాంఛిస్తున్నారు కాబట్టి శ్రీరామచంద్రుడు తండ్రి ఆజ్ఞను శిరసావహించక తాను పాలించే ప్రజాభిప్రాయాన్ని గౌరవించమంటాడు. కాని కవులు జాబాలి అభిప్రాయాన్ని వక్రంగా చిత్రించి ఆయనని హేతువాదిగా ముద్ర వేశారు. అలా వక్రంగా చిత్రించిన దానిని చదవటం వలన మనస్సు ఎలా ప్రవర్తిస్తుంది?

భ్రమరకీటకన్యాయము అన్నదాన్ని వ్యాసుడు ప్రయోగించాడు. వ్యాసుడు ఇచ్చిన వ్యాఖ్యానం వేరు, శాస్త్రకారుల వ్యాఖ్యానం వేరు. గొంగళిపురుగు తుమ్మెద ఝుంకారము వలన తదాకారాన్ని పొంది సీతాకోకచిలుకగా మారుతుంది అని వ్యాసుడు వివరిస్తే శాస్త్రకారులు దానిని ఇంకొక విధంగా చిత్రించి ఉన్న విషయానికి విపరీతార్థాన్ని తీశారు. మానవుడు తపన చెందవలసినది భగవానుని గురించి. అలా చేయటం వలన అదే తపస్సుగా మారిపోతుంది' అన్నారు శ్రీబాబు.

ఇంతలో డాక్టరు రాజు యుగపురుషుడు అనే వ్యాసాన్ని చదవటం ప్రారంభించాడు. శ్రీ బాబూజీ కలగజేసుకొని, 'వెంకటరత్నానికి ఇయ్యవయ్యా ఆయన చదువుతాడు' అన్నారు. ఇంతలో గోడమీద ఏదో వ్రాలింది. శ్రీ బాబూజీ రాజుగారివంక చూశారు. ఆయన దానిని చంపబోయారు. ఇంతలో డాక్టరు రాజు దానిని చంపాడు.

శ్రీ బాబూజీ కలుగజేసుకొని, 'అదేమిటయ్యా, నేను చదవద్దన్నానని, నీ కోపము ఆ దోమమీద చూపించి చంపేశావు' అన్నారు డాక్టరు రాజుని. శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ, 'చూశారా! రాజుగారి చేతిలో దాని చావులేదు కాని డాక్టరు రాజు చేతిలో దాని చావు నిర్ణయింపబడి ఉంది. ఏది ఎలా నిర్ణయింపబడి ఉంటే అలాగే జరుగుతుంది. భగవానుడు ఎవరి చేతిలో దేనిని నిర్ణయిస్తాడో ఎవరు చెప్పగలరు?' అన్నారు.

శ్రీబాబు నామదేవుడు, జ్ఞానదేవుడు గురించి చెపుతూ, 'వారి భాగ్యమే భాగ్యము. మీరు నాతో ఎలా మాట్లాడుతున్నారో వారు సాక్షాత్తు భగవానునితో అలాగే మాట్లాడేవారు. భగవానునితో అంత చనువుగా సంచరించారు. ఈ భాగ్యము మాదే కదా! అనుకున్నారు వారిరువురూ. భగవానుడు తమతోనే స్వేచ్ఛగా సంచరిస్తున్నారు అని అనుకుంటారు అందరూ. ఈ విషయము మీ అందరికి అనుభవమేగా? భగవానుడు సర్వవ్యాపకుడు అన్న విషయాన్ని మాత్రం గుర్తుంచుకోరు' అన్నారు.

ఇంతలో వెంకటరత్నంగారు వ్యాసము చదవటం మొదలు పెట్టారు. శ్రీ బాబూజీ కండ్లు మూసుకొని ధ్యానముద్రలో ఉన్నారు. వ్యాసము చదవటము ఆపివేశారు. శ్రీబాబు కలగజేసుకొని 'చదవవయ్యా, నేను నిద్రపోవటంలేదు. సోమరితనం పనికిరాదు. కాఫీ ఏమన్నా కావాలా?' అని అన్నారు.

చక్కగా కందిరీగ ఎంత చలాకీగా ఉంటుందో అంత చలాకీగా వుండాలి. ఝూం అని ఎగురుతుంది. చూడండి ఎంత active గా వుంటుందో. దాని నడుము సన్నగా ఉంటుంది. మంచి మేధాశక్తి గలది. దానిని మధ్యకి కోసినా తలతోనే యుద్ధం చేస్తుంది. పాపం మీకు ఏ పని చేయటానికీ టైములేదు. ఏద్దైనా కాస్త టైము దొరికితే దానిని మాత్రం వృథా చేయరు. ఆ టైముని నిదురలోనో, లేక ఏదో సంభాషణతోనో గడుపుతారు. కాని కూర్మదాసు చరిత్ర విన్నారు కదా! ఆయన అలా కాదు. పుట్టుకతోనే భక్తుడు. కూర్మదాసు అనూరుడి వంశానికి చెందినవాడు. కాళ్ళు లేకపోయినా భగవంతుని దర్శిద్దామనుకుంటాడు. అదీ విశ్వాసం అంటే. అటువంటి విశ్వాసము వున్నవాడికి సోమరితనం ఉండదు. వాడు నిదురకి, విషయాదుల గూర్చిన సంభాషణకి తావిస్తాడా?' అన్నారు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## గురు చంద్రుడు

"అలనాడు అమృతం కోసం దేవతలు, రాక్షసులు కలిసి మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకుని, వాసుకిని త్రాడుగా దాని చుట్టూ కట్టి, క్షీరసాగరాన్ని మథించడం మొదలు పెట్టేసరికి, మందరపర్వతం ఆ సముద్రంలో మునిగి పోవడం మొదలు పెట్టింది. దేవతలు శ్రీహరిని రక్షించమని ప్రార్థించగా, ఆయన కూర్మ రూపాన్ని దాల్చి, ఆ పర్వతాన్ని తన వీపున నిలబెట్టాడు. పాల కడలిని చిలుకుతూ వుంటే, కల్పవృక్షం, కామధేనువు, ఉచ్చైశ్రవం, ఐరావతం పుట్టుకు వచ్చాయి. వాటన్నింటినీ దేవతలు కైవసం చేసుకున్నారు. హాలాహలం పుట్టేసరికి, ఆ



విషాగ్ని జ్వాలలను తాళలేక దేవతలు మళ్ళీ ఈశ్వరుడిని ప్రార్థించగా, ఆయన ఆ హాలాహలాన్ని తన గళమునందే నిలబెట్టి గరళకంఠుడు అయ్యాడు.

ఆ తరువాత లక్ష్మీదేవి ఉద్భవించగానే, ఇంద్రుడు ఆమెను కూడా ఆశించాడు. తనని ఆశించిన వారిని చేరని శ్రీలక్ష్మి, తాను పుట్టినది ఆ నారాయణుని కోసమే కనుక, ఆయననే వరించింది. ఆ తరువాత ధన్వంతరి, అమృతం ఉద్భవించగానే, రాక్షసులు ఆ అమృత కలశాన్ని ఎగరేసుకు పోయారు. అది చూచి దేవతలు మరల శ్రీహరిని ప్రార్థించగా, ఆయన మోహిని రూపాన్ని దాల్చి, సత్వగుణ సంపన్నులైన దేవతలకు దానినందించాడు.

ఇటువంటి 'క్షీరసాగర మథనం' ప్రతి సాధకుడి మనసులోను దైవీగుణాలకి, అసుర గుణాలకి మధ్య అనునిత్యం జరుగుతూనే వుంటుంది. సాధనలో సాధకుడికి అనేక మంచి అనుభవాలూ కలుగవచ్చు; కష్టాలూ సంభవించవచ్చు. ఏవి వచ్చినా చలించక, ఆ భగవానునే నమ్మి, భగవన్నామ స్మరణ చేసినవారు తప్పక తమ గురుదేవుడు ప్రసాదించిన లక్ష్యాన్ని సాధించగలుగుతారు. లక్ష్య సాధనలో, అణిమాద్యష్టసిద్ధులు సంప్రాప్తించినా, వాటినాశించక, హాలాహలం వంటి చేదు అనుభవాలెదురైనా క్రుంగి పోకుండా, నిశ్చలంగా నిలబడిన

సాధకుడు మాత్రమే అమృతత్వాన్ని సాధించగలుగుతాడు. ఎటువంటి పరిస్థితి ఎదురైనా, 'నా ప్రభువు నన్ను రక్షించి తీరుతాడు' అనే ఆరూఢమైన విశ్వాసం కలిగి వున్న వారికి, ఎటువంటి లోటూ వుండదు. కుండకి చిల్లుంటే నీరెలా నిలువదో, విశ్వాసంలో చిల్లుంటే ఆ హృదయంలో భగవత్తత్వం నిలవదు. కాబట్టి, భగవంతుడనేవాడు వున్నాడు. అదే అనంత శక్తి. ఆ అనంతశక్తిని నమ్మండి. ఏ పేరుతో పిలిచినా భగవంతుడనేవాడు ఒక్కడే. ఆయన యందు అచంచలమైన విశ్వాసాన్ని పెంపొందించుకోండి. ఆయన మీలోని రాక్షస శక్తులను నశింపచేసి, దైవత్వాన్ని వృద్ధిపరచి, మీకు అఖండైశ్వర్య భోగభాగ్యము లను సుఖశాంతులను, భక్తి, జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి రక్షిస్తాడు."

## శ్రద్ధాంజలి


శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన శ్రీ దాసరి బుల్లి బ్రహ్మయ్యగారు 9-10-2025 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ భక్తులు, రామచంద్రాపురం నివాసులు అయిన శ్రీమతి కొండూరి రాజరాజేశ్వరీదేవి గారు (కొండూరి రామసుబ్రహ్మణ్యశర్మ గారి ధర్మపత్ని) 19-10-2025 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 60 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# మందస్మిత ప్రభాపూర మజ్జత్కామేశ మానసా

- పాలూరి కాళీప్రసాద్



అమ్మ "**మందస్మిత ప్రభాపూర మజ్జత్కామేశ మానసా**" తన చిరు దరహాస చంద్రికలతో పతిదేవుడైన కామేశ్వరుని మనస్సును ముంచివేస్తుంది. అసలు అలా ముంచివేసే ముందు అమ్మ ఎందుకు చిరునవ్వులు చిందిస్తోందో, ఆ చిరునవ్వుకు కారణమైన ఆ కామేశ్వరుని మనస్సులోని ఆలోచనలు ఏమిటో ఊహించడానికి ప్రయత్నిద్దాం.

బహుశా తన తండ్రి అయిన దక్ష ప్రజాపతి శాపానికి గురియైన చంద్రుని చేరదీసి శిరస్సున ధరించానని కోపగించదు కదా! అనుకున్నాడేమో ఆ చంద్రశేఖరుడు! మీకంటే ముందే నేను అష్టమీ చంద్రుని నా నుదుటిన ధరించాను (**అష్టమీ చంద్ర విభ్రాజదళికస్థల శోభితా**) స్వామీ! అలాగే సూర్యచంద్రులు ఇద్దరినీ నా చెవి కమ్మలుగా కూడా ధరించాను (**తాటంక యుగళీభూత తపనోడుప మండలా**) అని అమ్మ చిరునవ్వు నవ్వితే అయ్యవారి మనస్సు హమ్మయ్య! అని సమాధాన పడిందేమో!

గంగను సవతిగా తెచ్చి నెత్తిన పెట్టుకున్నానని అలగదు కదా! అని ఆ గంగాధరుడు బిడియ పడుతుంటే బ్రహ్మాండ వ్యాప్తమైన మీ దేహంలో సగం నేనే అయినప్పుడు ఎక్కడో మీ జటాజూటంలో ఒక చిన్న పాయలో ఇమిడిపోయిన గంగ నాకు పోటీయా? అని అమ్మ చిరునవ్వు నవ్వితే స్వామి మనసు కుదుట పడిందేమో!

తనని, నన్ను కలపడానికి ప్రయత్నిస్తున్న మన్మధుని భస్మం చేశానని కినుక వహించదు కదా! పైగా అతడు తనకి మేనల్లుడు కూడానూ, అని భయపడుతున్న ముక్కంటిని స్వష్ఠపరుస్తూ "వాడేదో వెర్రివాడు. తపస్సు ద్వారా ఏకమవ్వవలసిన మనలని వాడికి తెలిసిన కామం ద్వారా ఏకం చేయాలని చూసి పాపం మీ చూపులో భస్మం అయిపోయాడు. ఎవరో మనను కలిపేది ఏమిటి? మీరెప్పుడో నా వారు, ఎందుకంటే నేను **స్వాధీన వల్లభ**ను. అయినా ఏం భయం లేదులే. వాడి పాలిట నేను సంజీవనినై మళ్ళీ బ్రతికించాను (**హర నేత్రాగ్ని సందగ్ధ కామ సంజీవనౌషధిః**)" అని ఊరడింపుగా నవ్విందేమో!

తాను ముచ్చటపడి ఎంతో అందంగా తయారుచేసుకున్న కుమారుని శిరస్సును నా కోపంతో కత్తిరించి ఏనుగు తల పెట్టానని బాధపడుతోందేమో! అని

విచారిస్తున్న ఆ తండ్రికి స్వాంతనగా తల ఎలా ఉన్నా ప్రతి తల్లికీ తన కన్నకొడుకే లోకంలోకెల్లా అందగాడు లెండి (**అగజానన పద్మార్కం**) అని అనునయింపుగా నవ్విందేమో!

ఇంట్లో ఇంత అందమైన భార్యను పెట్టుకొని ఒక మగవాడు ఆడవేషం ధరిస్తే చూసి మోహంలో పడిపోయానని తనను వెక్కిరిస్తుందేమో అని సిగ్గుపడుతున్న విష్ణుప్రియుని సమాధాన పరుస్తూ ఆ **అనంగ జనకు**ని లావణ్యం అంతా నా **అపాంగ విలోకనం** నుండి వచ్చిందే లెండి, మీరు మాత్రం మోహంలో పడిపోక ఏం చేస్తారు? అని నవ్విందేమో!

తాను సర్వాభరణ భూషితయై సాయంకాలం వేళ నాకోసం ఎదురు చూస్తూ ఉంటే నేను రోజంతా శ్మశానంలో తిరిగి ఒంటినిండా బూడిద పూసుకొని వస్తున్నానని చీదరించుకుంటుందేమో అని సందేహిస్తున్న శంకరుని చూసి ఈ ప్రసూతిశాలలు, శ్మశానాలు నాకేమీ కొత్త కాదు. నేను ఒకసారి కనురెప్ప వేసే సమయంలో భువనాలన్నీ పుట్టి, పెరిగి, లయమైపోతూ ఉంటాయి (**ఉన్మేష నిమిషోత్పన్న విపన్న భువనావళిః**) అని ఆ లోకజనని స్వాంతనగా నవ్విందేమో!

చెప్పాపెట్టకుండా మాయమైపోయి, తీరా ఇంత విషం తాగి, గొంతంతా నల్లగా చేసుకుని వచ్చానని నిలదీస్తుందేమో అని కంగారు పడుతున్న ఆ నీలకంఠుని ఓదారుస్తూ మీరేం తాగినా నాకేం భయం లేదు. ఎందుకంటే నేను **సర్వమంగళ**ని. పైగా మీకేమయినా అయితే దానికి వైద్యం చేయగల శక్తి కూడా నాకు ఉంది (**శివా రుద్రస్య భేషజీ**) అని ధైర్యంగా నవ్విందేమో అమ్మ!

భస్మాసురునికి ఇవ్వకూడని వరమిచ్చి లయకారకుడనైన నేనే లయమైపోయే స్థితిని తెచ్చుకున్నానని మందలిస్తుందేమో అని మధనపడుతున్న భోళాశంకరుని ఓదారుస్తూ బావ బ్రతుకు కోరే బావమరది మీకుండగా ఇక ఎందుకు చింత అని తన అన్నగారిని తలుచుకుంటూ చిరునవ్వు నవ్విందేమో ఆ **పద్మనాభ సహోదరి!**

పాపం ఈ నంది ఎప్పటినుండో నా సేవ చేసుకుంటున్నాడు. ఇప్పుడు ఈవిడ కొత్తగా సింహ వాహనాన్ని తెచ్చింది. దానిని చూసి నంది ఎక్కడ భయపడతాడో అని సందేహిస్తున్న భర్తకు ధైర్యం చెబుతూ సృష్టిలో ఎంత విభిన్న తత్వాలు కలిగివుండి, పరస్పరం శత్రువులైనా ఒక కుటుంబంలోకి వచ్చాక అందరూ పరస్పరానురాగంతో మెలగాలని మన కుటుంబమే లోకానికి చాటుతుంది లెండి, ఏం భయం లేదని ఆ **విశ్వమాత** నవ్విందేమో!

నాకేమో పులి చర్మం ధరించడం అలవాటు. ఈ దుర్గేమో ఆ పులినే వాహనంగా చేసుకుంది. ఇప్పుడెలా అనుకుంటున్న మృగచర్మాంబర ధారిని చూసి అసలు ఈ సృష్టిలోని చర్మాలన్నీ ధరిస్తూ, ఈ బొమ్మలన్నింటినీ లోపలుండి నడిపేది నేనేనయ్యా అని నవ్విందేమో ఆ **క్షేత్ర స్వరూప, క్షేత్రేశి, క్షేత్ర క్షేత్రజ్ఞపాలిని!**

నాకసలే కోపం ఎక్కువ. ఎప్పుడు ప్రళయ తాండవం చేసి ఈ విశ్వాన్నంతటినీ లయం చేసేస్తానో అని ఆందోళన పడుతున్న లయకారకుడికి ఆశ్వాసన కలిగిస్తూ మీ ప్రళయ తాండవాన్ని నియంత్రించి ఆనంద తాండవంగా మార్చడానికి నేను లాస్యనృత్యంతో సిద్ధంగా ఉన్నాను కదా అని నవ్విందేమో ఆ **లాస్యప్రియ**, తాను కూడా **లయకరి**నన్న మాట మరచిపోయి!

నేనేమో శుద్ధ స్ఫటిక సంకాశుడనై తెల్లగా మెరిసిపోతుంటే నాకీ నల్లటి భార్య దొరికిందేమిటి అని ఆశ్చర్యపోతున్న కర్పూర గౌరునికి ప్రత్యుత్తరమిస్తూ ఒక్క నలుపేమిటి అన్నీ రంగులు నేనే. కాళిని నేనే, శ్యామలను నేనే, గౌరిని నేనే. త్రిగుణాత్మిక ప్రకృతినైన నానుండి మీ ధవళకాంతి ప్రసరించడం వలననే ఇన్ని రంగులు ఏర్పడుతున్నాయి కదా అని నవ్విందేమో!

నేనేమో ఒంటినిండా పాములు ధరించి ఉంటాను. అవి బుసలు కొడుతూ ఉంటాయి. కొంపదీసి నా భార్య వీటిని చూసి భయపడదు కదా అని కళవరపడుతున్న నాగభూషణుని సముదాయిస్తూ ఈ పాములు నాకు కొత్తేం కాదు. మా అన్నగారు కూడా ఎప్పటినుంచో పాము మీదే పడుకుంటున్నాడు అని నవ్విందేమో!

ఈ కాళీవనాశ్రమంలో భక్తులేమిటి, నీ పేరుతో దేవి నవరాత్రులు అని చెప్పి రోజులో సగం సమయం ఆ రామాలయంలోనే సత్సంగంలో ఉంటారు అని వేళాకోళ మాడబోయిన రామలింగేశ్వరునితో ఏ స్త్రీకయినా తన జీవితంలోని ముఖ్య వేడుకలు పుట్టింటివారి సమక్షంలో జరిగితే ఆనందమే కదండీ! అయినా నన్ను అంటున్నారు కానీ ప్రతి శ్రావణ శుక్రవారానికి మీ చెల్లెలు వరలక్ష్మీ దేవి పూజలు మన శివాలయంలో జరగట్లేదా ఏమిటి? పైగా ఈ సంవత్సరం ఒక శుక్రవారం ఎక్కువే వచ్చింది కూడానూ అని గారంగా నవ్వింది జగన్మాత. ఓ అందుకేనా ఈ సంవత్సరం నవరాత్రులలో కూడా ఒకరోజు ఎక్కువ తెచ్చుకున్నావు అంటూ నవ్వేశాడు పరమేశ్వరుడు.

ఇలా జగన్మాతా పితరులైన పార్వతీ పరమేశ్వరుల సరస సల్లాపాలతో వారి చిరు దరహాస కిరణాల వెన్నెలలో మన జీవితాలు గడిచిపోతే అంతకంటే కావలసింది ఏముంటుంది?

# గురువనగ బ్రహ్మవస్తువు

- సన్నిధానం కాళీమాత

శ్రీ గురుదేవుల తత్వమును తెలియ పరచవలసి వచ్చినప్పుడు 'గురువనగ బ్రహ్మ వస్తువు గోప్యమిది' అని చెబుతారు. కాని, అందరి వలే శరీరముతో వుండి, శారీరిక అవసరములు తీర్చుకుంటూ, సాధారణ మానవ మాత్రులుగా కనిపించే వారు, నిర్గుణ, నిరాకార, నిస్సంగ బ్రహ్మవస్తువు ఎలా అవుతారు అనే ప్రశ్న సహజము. గురుభక్తులందరూ వారి వారి అనుభవాలను అనుసరించి, అనేక సమాధానాలు ఇస్తుంటారు. పురాణంలో శ్రీకృష్ణుడు స్వయంగా మైత్రేయ మహర్షికి చేసిన బోధలో దానికి స్పష్టము, సరియైన సమాధానము వుంది.

శ్రీకృష్ణ నిర్వాణ సమయంలో స్వయంగా శ్రీకృష్ణుడే సమర్థుడు, తగినవాడు అయిన మైత్రేయ మహర్షిని పిలిపించి, గురుతత్వాన్ని బోధించి (**కృష్ణం వందే జగద్గురుమ్**) భవిష్యత్ తరాలకు అందజేసే బాధ్యతను అప్పగించినట్లు  అంతేకాక ఈ జ్ఞానమునంతటిని, తాను శరీరమును త్యజించుటవలన అత్యంత దుఃఖముతో వున్న విదురునికి బోధించ వలసినదిగా చెప్పినట్లు 'జైమిని భారతం'లో విదుర మైత్రేయ సంవాదంలో వివరించడం జరిగింది.

నేటికీ అనేకమంది నిత్యం 12 సంవత్సరాల వయస్సుగా దర్శనమిచ్చే మైత్రేయ మహర్షి గురించి అనేక విధాలుగా తెలుసుకుని, ఆయనను భావనలో దర్శనం చేసుకుని, గురుతత్వం అక్కడ వున్నదనే భావనతో ఆరాధాన చేస్తున్నారు.

**నమస్తే కృష్ణ నిష్ఠాయ యోగినాం పతయే నమః।**
**బ్రహ్మజ్ఞాన స్వరూపాయ మైత్రేయాయ నమో నమః॥**

శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పిన విషయాలు అంత తేలికగా అర్థం అయ్యేవి కావు. స్వామిని ఆదర్శంగా తీసుకుని ఆయన తత్త్వాన్ని గ్రహించి, ఆయనను భావనలో నిలుపుకుని కర్మ చేస్తే, ఆ కర్మ లోకానికి ఫలాన్నిచ్చి, కర్తకు ఫలం లేకుండా చేయడం అనేది కృష్ణ తత్వంలోని రహస్యం. ఆ సత్యమే శ్రీకృష్ణుడు మైత్రేయునికి బోధించడం జరిగింది.

ప్రతి కర్మ జీవునికి బంధ హేతువే అవుతుంది. అది కామ్యకర్మ అయినా, సమాజ శ్రేయస్సు కొరకు చేసేది అయినా. నేను అనే భావన

**'అహం కరిష్యే'** అంటాం కదా! అది వున్నంత వరకు బంధన హేతువే. పునర్జన్మను ఇచ్చేదే. కాని శ్రీకృష్ణుడు చెప్పిన ప్రకారం, జీవుడు చేసే కర్మ ఏదైనప్పటికీ తాను సాక్షీభూతుడుగా వుండి, శరీరమును కర్మ సాధనముగా భావించి చేస్తే, అది బంధన హేతువు కాదు.

ఉదాహరణకు యజ్ఞంలో ఉపయోగించే సృక్కు సృవలు (ఘృతము వేసే గరిటవంటివి) యజ్ఞ కర్మకు సాధనములు. ఈ దేహం కూడా అటువంటిదే. యజ్ఞఫలములు ఆ కర్మసాధనములకు అంటనట్లే, దేహమును సాధనముగా, పరికరముగా మాత్రమే భావించేవారికి, కర్మ ఫలములు అంటవు. చేసే కర్మ ఫలితములపై దృష్టి వుంచక, అంతరంగ మందు ద్రష్ట మాత్రముగా వుండి, శరీరాన్ని సాధనముగ, పరికరముగా మాత్రమే భావించి చేసే కర్మల యొక్క ఫలితం జీవుని బంధించదు.

శ్రీబాబూజీ మహరాజ్ వారు చెప్పించిన **'యస్య సర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః'** యొక్క నిగూఢ అర్థం అదే. సద్గురువులు లోకంలో అనేక కర్మలు చేస్తున్నట్లుగా మనకు కనిపించినా అవి వారిని బంధించవు. వారు నిరంతరం బ్రహ్మ భావనలో వుంటూ, భౌతికంగా తాను చేసే కర్మలకు శరీరమును ఒక పనిముట్టుగా మాత్రమే వుపయోగిస్తారు. అందుకే వారిని సాధారణ మానవులుగా కాక, బ్రహ్మ వస్తువుగా గుర్తించి, సాధకులు వారి ఉపదేశానుసారం నడచి, తమ జీవితాలను ధన్యం చేసుకోవాలి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***నవంబర్ 2025 :*** AS 9263

***డిసెంబర్ 2025 :*** AS 6271, 6309, 6533, 6822, 7159, 7192, 7592, 8554, 8555, 8556, 8557, 8558, 8559, 8566, 8571, 9264, 9269, 9295, PK 0108

# శ్రీ మాతాజీ బోధ

-డా. పి. రాఘవేంద్ర

2-5-1995 - శ్రీ బాబుజీ మహారాజ్ దివ్యమంగళమూర్తి ప్రతిష్ఠ మహెూత్సవంలో శ్రీ మాతాజీ వారు బోధించిన విషయ సారాంశం.

ప్రకృతి గతమైన మనస్సుకు విషయాదులలో ఎంత ప్రయత్నిస్తున్నా అలసట కలుగదు. కానీ, ఏదైనా సద్వస్తువు గురించి విచారణ చేయవలసి వస్తేనో, లేదా సంకీర్తన చేద్దామంటేనో, లేదా ధ్యానం చేయాలంటేనో మాత్రం ఎక్కడలేని అలసట, నిద్ర ముంచుకొని వస్తాయి. అదే మాయయొక్క ప్రభావం. ఆ మాయను రహితం చేయడానికి భగవంతుడు సద్గురు రూపాన్ని స్వీకరించి, సమర్థ సద్గురు మహారాజ్‌గా, అంటే మన బాబూజీగా, చంటిపాపలా మన కంటిపాపలా అవతరించారు. బాబూజీ ఎవరితో ఏమి చేయిస్తారో అది బాబూజీకే తెలియాలి. బాబూజీని తలచుకుంటే చాలు, అసాధ్యాలు సుసాధ్యాలు అవుతాయి. బాబూజీ లీలలను గుర్తు చేసుకుంటే చాలు, ఆనందంతో మనల్ని మనం మర్చిపోతాము.

సంసారంలో తిరిగి తిరిగి అలసట చెందిన జీవులకు సేదదీరేటట్లుగా నిరంతరం జ్ఞాన కిరణాలను ప్రసరింపజేసే జ్ఞాన భాస్కరులైన సద్గురుదేవుల దివ్య మంగళమూర్తిని మనం ఈనాడు ప్రతిష్ఠిస్తున్నాము. అంటే ఈ మంగళకరము, ఆనందకరము అయిన శుభ సమయములో మనం సద్గురుదేవులను మన సంకల్పాలతో ప్రతిష్ఠిస్తున్నామా? అని ప్రతివారు తమకు తాము తరచి చూసుకోవాలి. ఏనాడో కవి గారు:-

“మదిలో నీదగు మూర్తి నిల్పుకొని సంభావింతుమే గాని నిన్నిదమిత్థమ్మని నిర్ణయింప వశమా ఎవ్వారికిన్, నమ్మి నీ పదరాజీవమ్ముల నాశ్రయించితిమి, లోపంబేమి? నీ వారమే కదా, రక్షింపక నీకు తీరదు కదా కాళీ ప్రసాద ప్రభో” అని నిన్నిదమిత్థము అని నిర్ణయించడానికి ఎవరి తరం కాదు, నీతో పోల్చడానికి సరిపోయే వస్తువు ఏదీ లేదు అని తేల్చిచెప్పారు. ప్రతి భక్త హృదయమూ బాబు నుండి పొందవలసిన దానిని సంపూర్ణంగా పొందింది. బాబూజీ మనసారా నవ్వుతూ, నవ్విస్తూంటే నవ్వడం, బాబూజీ ఒక్క కరుణా కటాక్ష వీక్షణానికే పులకించిపోతూ, భక్తులు పొందే ఆనందం, అది అనుభవైకవేద్యం.

అటువంటి సద్గురుదేవులను అభిషేకిస్తున్న భావంతో సంప్రోక్షించిన తీర్థంలోని ప్రతి బిందువుకు ఫలంగా వారికి బాబూజీ ప్రసాదించిన ఆనందం అనుభవైకవేద్యం. బహుశః మనలోని త్రిగుణాలు హరించాలి అనేనేమో ఈ ప్రతిష్ఠ అనే కార్యక్రమాన్ని బాబూజీ మూడు రోజులు జరిగేటట్లు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు రోజులు మీరు

అన్నీ సత్సంగ కార్యక్రమాలలో చక్కగా పాల్గొని, మీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పండగలకి, పబ్బాలకి మీ యింటికి వచ్చిన పిల్లలు తిరిగి వెళ్ళిపోతూంటే మీకు ఎంత బాధగా ఉంటుంది. స్వార్థపూరితమైన ప్రేమ ఉండే చోటునే ఇంత బాధ ఉంటే, యిక నిస్వార్ధమైన ప్రేమమూర్తులైన బాబూజీకి మీరంతా రాగానే తిరిగి వెళ్ళే ప్రయత్నాలు చేసుకుంటుంటే ఎలా ఉంటుందో మీరే ఊహించుకోండి. అందుకే ఈ మూడు రోజులు అన్ని కార్యక్రమాలలో పాల్గొని మీ సమయాన్ని సద్వినియోగం చేసుకోండి.

ఎవరికి ఏదేది యిష్టమో, ఆయా జీవులకు వాటిని అందిస్తూ వారందరికీ ముక్తిని ప్రసాదించి తరింపజేయడానికే బాబూజీ అవతరించింది. ప్రసాదం తిన్న కుక్కకు కూడా మోక్షం లభిస్తుందంటే ఆ ప్రసాదం యొక్క మహిమ ఎటువంటిదో తెలుసుకోండి. అన్ని కార్యక్రమాలలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి స్వామి కృపకు పాత్రులై మీలో వున్న మాయను రహితం చేసుకోండి. ఇప్పటికైనా త్వరపడి మేల్కొని మీరు రూప నామ క్రియా రహితుడయి మనకోసం మానవరూపంలో అవతరించిన సద్గురుదేవుని కృపను సాధించాలి.

బాబూజీ అంటుండేవారు "భగవానుడు నిరాకారుడు,నిర్గుణుడుగా వస్తే మానవులు గుర్తించలేరు, పోనీ ఇలా వస్తే మానవులు గుర్తించలేకపోతున్నారు కదా అనే వారిపై దయ తలచి భగవానుడు సాకారంగా అవతరిస్తే మానవుడు ఆ అవతారమూర్తిని సాటి మానవుడిగా మాత్రమే భావించి భగవంతుడిగా గుర్తించలేక పోతున్నాడు. భగవానునికి రెండు విధాల చిక్కే వచ్చింది. అందువలన నీవు నిజంగా ఏదై వున్నావో విచారణ చెయ్యి. నీవు వచ్చేటప్పుడు దేనిని వెంట తీసుకొని వచ్చావు, పోయేటప్పుడు దేనిని వెంటపెట్టుకొని పోతున్నావని విచారించు. ఆలోచించి చూస్తే నీవు వచ్చేటప్పుడు దేనినీ వెంట తీసుకొని రాలేదు, అలాగే పోయేటప్పుడు దేనినీ వెంట తీసుకొని పోవడం లేదు కానీ మధ్యలో మాత్రం అనేక బాధలు పడుతున్నావు. దానికి కారణం ఏమిటి? నీలోని కోర్కెలు, నీలోని ఆశ, నీవు చేసే కర్మలు అందువల్లనే మహాత్ముల సన్నిధికి వెళ్ళినప్పుడు వారి బోధను శ్రద్ధగా వినాలి.

నీ చెవులను మహాత్ముల బోధను శ్రవణం చేయడానికి మాత్రమే వినియోగించాలి కాని, సంసారానికి సంబంధించిన విషయాలను వినడానికి వినియోగించకూడదు. అలా శ్రద్ధగా విన్న బోధామృతాన్ని నీ హృదయంలో పదిలంగా దాచుకోవాలి. అదే మానవజన్మను సార్ధకం చేసే శాశ్వతమైన ఆభరణం.

- సశేషం

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

అర్జునుడి విషయమే తీసుకుంటే, అతడు తనకు కలిగిన ఆసక్తిని జాలిగా, పరాకృపగా భ్రమించాడు. ఆ ఆసక్తి వలన అతడు అస్త్ర సన్యాసం చేస్తానని, భిక్షాటనం చేసి అయినా ఆత్మానుభూతిని పొందవచ్చుననీ శ్రీకృష్ణ భగవానుడితోనే వాదించే స్థితికి దిగజారిపోయాడు. అర్జునుడు తన స్వధర్మాన్ని మరచి, ఆ మార్గంలో పయనించి ఉంటే, తన లక్ష్యాన్నీ, మార్గాన్నీ, సర్వస్వాన్నీ కోలుపోయి వుండేవాడు. కాని ఆ సమయంలో అర్జునుడిలో ఉన్న సాధకుడు మేలుకొని తొంగి చూశాడు.



అందువల్లనే అర్జునుడు "కృష్ణా! నా మనస్సు పరిపరివిధాల పరిభ్రమిస్తున్నది. నేను నీకు సంపూర్ణంగా శరణాగతి చెందుతున్నాను. నన్ను కరుణించి శిష్యుడిగా స్వీకరించి నా యందు ప్రసన్నుడవై, నాకు కర్తవ్యాన్ని బోధించు" అని ప్రార్థించాడు. అర్జునుడిలోని ఈ సాధకుడికే గీతోపదేశం జరిగింది. నీలో కూడా అర్జునుడిలో లాగే సాధకుడు వున్నాడు. ఇతనినే మనం దివ్యప్రకృతి అనీ, కూటస్థుడు అని వ్యవహరిస్తున్నాము. ఈ సాధకుడే నీలో ఉదాత్తమైన, లేదా దివ్యమైన ప్రకృతిగా వ్యక్తమౌతున్నాడు. విషయాదుల పట్ల ఆకర్షణయే నీలోని నీచ, లేదా అధమ ప్రకృతి. శ్రీరామకృష్ణ పరమహంస వీటినే పక్వాహంకారము, అపరిపక్వాహంకారము అని అన్నారు. అంటే ఇక్కడ నిజంగా పుణ్య పురుషుడు, పాపపురుషుడు అని, లేదా అక్షరపురుషుడు, క్షరపురుషుడు అని ఇద్దరు పురుషులు విడివిడిగా ఉన్నారని కాదు. ఒకే పురుషుడు వర్తిస్తూ ఈ రెండు స్థితులను పొందుతున్నాడు. ఆ ఒక్క పురుషుడే వేరువేరు స్థితులలో వర్తిస్తూ ఉన్నప్పుడు అలా వేరువేరుగా పిలువ బడుతున్నాడు. ప్రతి జీవిలో లాగే నీలో కూడా అహం స్ఫురణకు మూలమై, ఈ అపరిపక్వాహంకార, పక్వాహంకార స్థితులలో వర్తించే ఉత్తమ

పురుషుడు ఉన్నాడు. అందువల్లనే శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడిని నిమిత్తంగా చేసుకొని, ఆ పురుషోత్తముడిని గురించిన ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించి, ఈ అహంకార, మమకారాల నిజతత్త్వం ఏమిటో నీకు, అలాగే సాధకులకందరకు తెలిసేలా చేశాడు.

నిజానికి ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానం అనేవి వేరుకావు. ప్రతివ్యక్తి తన అస్తిత్వానికి సంబంధించిన నిజమైన సత్‌ను తెలుసుకుంటే, ఆ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానం అని పిలుస్తున్నాము. స్వరూప జ్ఞానమే ఆత్మజ్ఞానం. అలాగే ఈ జగత్తు యొక్క ఉనికికి మూలమైన సత్ యొక్క జ్ఞానాన్ని బ్రహ్మజ్ఞానం అని పిలుస్తున్నాము. నీవు నీ సాధన ఫలించిన తరువాత ఏ శక్తి, నీ ఉనికికి సత్‌యై ఉన్నదో, ఆ శక్తియే జగత్తు యొక్క ఉనికికి కూడ సత్‌యై ఉన్నది అని, స్వాత్మయే, విశ్వాత్మ అని, అదే బ్రహ్మము అన్న సత్యాన్ని అపరోక్షంగా తెలుసుకుంటావు. ఒక వ్యక్తి పేరు రామారావు అనుకుందాము. బయట అందరూ అతనిని రామారావు అని పిలుస్తారు. కాని ఇంట్లో అందరూ అతనిని బాబు అని పిలుస్తూ ఉండవచ్చు. రామారావు అని పిలువబడ్డా, బాబు అని పిలువబడ్డా, పిలువబడుతున్న వ్యక్తి మాత్రం ఒక్కడే. అలాగే ఆత్మ అని పిలువబడ్డా, లేదా బ్రహ్మము అని పిలువబడ్డా, ఆ సత్పదార్థము మాత్రము ఒక్కటే అని నీవు గ్రహించాలి. ఇప్పటి వరకు జరిగినది ఏదైతే ఉన్నదో అది గీతోపదేశానికి ఉపోద్ఘాతం అని మనం భావించవచ్చు.

**శ్రీ భగవానువాచ:**

**11. అశోచ్యా నన్వ శోచస్త్వం ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే**
**గతాసూన గతాసూంశ్చ నాను శోచంతి పండితాః ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! నీవు ఎవరిని గురించి దుఃఖింప నవసరము లేదో వారిని అంటే, భీష్మ ద్రోణాదులను, కౌరవులను గురించి దుఃఖిస్తున్నావు. పైగా ప్రజ్ఞావాదము, అంటే దంభములు పలకటం చేస్తున్నావు. పండితులైన వారు పోయిన ప్రాణములను గురించి అయ్యో అవి పోయాయే అని కాని, ఉన్న ప్రాణములను గురించి అయ్యో అవి పోతాయేమో అని గాని దుఃఖించరు" అన్నాడు.

- సశేషం

# నరసింహ మెహతా

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళీ

కుమార్తె కుంవరీబాయి శ్రీమంతానికి అత్త వారి కుటుంబములో అందరికీ ఖరీదైన బట్టలు, బహుమతులు ఇవ్వాల్సి వుంది. కానీ నరసింహ వట్టి చేతులతో వెళ్ళాడు. అత్తవారి నిరసన చూసి, వారికి ఏమి కావాలో లిస్టు వ్రాసి ఇవ్వమన్నాడు. అత్తవారు నరసింహకు అందుబాటులో లేని ఖరీదైన వస్తువుల లిస్టు వ్రాసి యిచ్చారు. నరసింహ ఆ లిస్టు చేతిలోకి తీసుకుని, శ్రీ కృష్ణుని ప్రార్థించినంతనే ఒక వర్తకుడు వచ్చి ఆ లిస్టులో ఉన్నవాటికంటే ఎక్కువ ఖరీదైన వస్తువులు అందించి వెళ్ళాడు. అక్కడ ఉన్నవాందరూ ఆశ్చర్యానికి లోనై, నరసింహ భక్తిని కొనియాడారు.

నరసింహ భక్తికి ఇన్ని నిదర్శనాలు ఉన్నా నగర బ్రాహ్మణులకు జ్ఞానోదయం కలగక, ఇంకా నరసింహను ఎగతాళి చెయ్యాలనే ఆలోచన మానుకోలేదు. ద్వారకకు వెళ్తున్న ఒక భక్త బృందాన్ని నరసింహ ధనవంతుడని, పైకి బీదవానిగా నటిస్తున్నాడని, ద్వారకలో తమకు ధనం అందేటట్లు హుండీ (ప్రామిస్సరీ నోటు) వ్రాయించుకోమని నరసింహ దగ్గరకు పంపించారు. నరసింహకు బ్రాహ్మణులు తనను ఎగతాళి చెయ్యటానికి చేస్తున్న కుట్ర అర్థమయ్యింది. అయినా శ్రీకృష్ణుని తలచుకుని ద్వారకలోని శ్యామలషా శేఠ్ అనే వ్యక్తి పేరు మీద 700 రూపాయలకు హుండీ వ్రాసి యిచ్చాడు.

భక్తులు ద్వారక చేరుకుని శ్యామలషా శేఠ్ అనే వ్యక్తి కొరకు వాకబు చేయగా, అటువంటి వ్యక్తి ఎవరూ లేరని తేలింది. భక్తులు మోసపోయామని భావించారు. అంతలోనే శ్యామలషా శేఠ్ అనే వ్యక్తి వారి వద్దకు వచ్చి అసలు, వడ్డీతో సహా చెల్లించి వెళ్ళాడు. నరసింహ భక్తి వల్ల శ్రీకృష్ణుడే వచ్చి డబ్బు చెల్లించాడని భక్తులకు అర్థమయ్యింది. నగర బ్రాహ్మణులు అంతటితో ఆగక, జునాగఢ్ రాజుకు నరసింహ ప్రజలను మోసం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. రాజు కూడా వారి మాటలు నమ్మి నరసింహను గుడిలోని దామోదరుని (విగ్రహం) మెడలో ఉన్న పూలమాలను ధరించి తన భక్తిని నిరూపించుకోవాలని లేకపోతే తగిన శిక్ష విధించబడుతుందని ప్రకటించారు.

నరసింహ ఏకాగ్రతతో శ్రీకృష్ణుని ప్రార్థించగా, మర్నాడు ఉదయం నరసింహ మెడలో పూలమాల ప్రత్యక్షం అయ్యింది. రాజు కూడా నరసింహ భక్తిని మెచ్చుకుని, నరసింహను పరీక్షకు గురిచేసినందుకు క్షమాపణ కోరాడు.

నర్సింహ తన చివరి రోజులు మాంగ్రోల్ గ్రామంలో గడిపి, 79 ఏళ్ల వయసులో బ్రహ్మైక్యం చెందినట్లు చెపుతారు. అక్కడి శ్మశానానికి నర్సింహ మెహతా పేరు పెట్టారు.

నర్సింహ మెహతా అవార్డు గుజరాతీ సాహిత్యంలో ఉన్నత ప్రతిభను గుర్తించేందుకు ఇవ్వబడుతుంది. నర్సింహ మెహతా గౌరవార్థం అహ్మదాబాద్‌లోని వాస్త్రాపూర్ సరస్సుకు ఆయన  పేరు పెట్టారు.

**శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు 2025**
**22-9-25 నుండి 4-10-25 వరకు**
**శ్రీ లలితా కోటినామ పారాయణ**
**1కోటి, 75 లక్షల, 53 వేలు**
**1,75, 53,000**

***పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు***

**** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును****

నవంబర్ 2025
5 బుధ: కార్తీక (గురు) పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన
8 శని : శ్రీ సద్గురు దేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం.
14 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీగురుదేవుల వార్షిక పుణ్యారాధన, శ్రీ సద్గురు పాదపూజ.
డిసెంబర్ 2025
1 సోమ: మార్గశిర శుద్ధ ఏకాదశి – గీతాజయంతి, శ్రీమద్భగవద్గీతా పారాయణ, శ్రీ సద్గురు పాదపూజ.
4 గురు: మార్గశిర పూర్ణిమ – దత్త జయంతి, శ్రీ సద్గురు పాదపూజ.
14 ఆది: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ
16 మంగళ: ధనుర్మాస వ్రత ప్రారంభం – ధనుర్మాసంలో ప్రతిరోజు ఉ. 5.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.
25 గురు: క్రిస్మస్ – శ్రీ సద్గురు పాదపూజ.
30 మంగళ: ముక్కోటి ఏకాదశి. – శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**71. ఓం శరచ్చంద్ర ప్రతీకాశ భ్రాజమాన స్మితాననాయ నమః**

శ్రీగురుదేవులు శరత్కాలంలోచల్లని వెన్నెలలు కురిపించే పూర్ణ చంద్ర బింబం వంటి చక్కని మందహాసంతో కూడిన మోము కలవారు. ఎంతటి బాధా తప్త హృదయాలనైనా ఆ మందహాసం ఆనంద సాగరంలో ముంచి వేస్తుంది.

**72. ఓం భక్తావన సముద్యోగ బంధురాయ నమః**

శ్రీ గురుదేవులు భక్త రక్షణ పరాయణులు. ఆర్తితో ప్రార్థించే భక్తులను రక్షించటానికి వారు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. కేవలం భౌతికమైన ప్రమాదాలనుంచే కాకుండా ఆధ్యాత్మికంగా హాని కలిగించే అహంకార మమకారముల నుండి, కామ క్రోధాది శత్రువుల నుండి వారు తమ భక్తులను ఎల్లప్పుడూ కాపాడుతూ ఉంటారు.

**73. ఓం కంబుకంధరాయ నమః**

శ్రీగురుదేవులు శంఖం వంటి కంఠం కలిగిన వారు. శంఖం పైకి మూడు గీతలతో, అనేక అలంకారాలతో కనిపిస్తుంది. కానీ దాని లోపల ఆకాశం మాత్రమే నిండి ఉంటుంది. అది చూపరులకు ఆనందాన్ని కలిగించుటే కాక దివ్యమైన ప్రణవ నాదాన్ని వెలువరిస్తూ శ్రవణానందాన్ని కలిగిస్తుంది. అంతే కాక యుద్ధ రంగంలో శతృవులకు మృత్యు ఘోష వలె భయోత్పాతాన్ని కలిగిస్తుంది. శ్రీగురుదేవుల కంఠం నుండి వెలువడే దివ్య వాక్కు కూడా అదే విధంగా తమ శిష్యుల హృదయాలను ఆనందింప చేయటమే కాక వారి మనస్సులలోని అంతః శత్రువులను పారద్రోలుతుంది.

**74. ఓం రక్త శ్యామల వర్ణాతి చారు కోమల శరీరాయ నమః**

త్రిజగన్మోహన నీలకాంతితో ఆవిర్భవించి, అనునిత్యము చేసిన జగన్మాత అర్చనచే కుంకుమ వర్ణము నాపాదించుకున్న అతి సుందరమైన, కోమలమైన దివ్యదేహము కలవారు శ్రీగురుదేవులు. యిందు ఎరుపు వర్ణము హనుమంతునికి, నలుపు కాళీ మాతకు సూచనలు.

**75. ఓం ధర్మజ్ఞాయ నమః**

సర్వధర్మములు శ్రీగురుదేవులనుండియే ఉద్భవించినవి. తమ శిష్యులైన వారిలో ఎవరెవరికి ఏ ఏ ధర్మములు శ్రేష్ఠములైనవో గ్రహించి వారిచే అట్టి ధర్మములను ఆచరింప చేయుదురు. శ్రీగురుదేవుల వాక్కులను తు.చ. తప్పక ఆచరించుటే శిష్యుల కర్తవ్యము.

**76. ఓం మంజులాలాపాయ నమః**

శ్రీ గురుదేవులు మృదుమధురమైన వాక్కు కలవారు. వారు నిరంతరం స్వస్వరూప సమాధి స్థితిలో ఓలలాడుతూ ఆ మధురానందాన్ని అనుభవిస్తూ ఉంటారు. అందుకే వారి నోటి నుండి వచ్చే ప్రతి పలుకు మధురమై భక్త హృదయాలను ఆనందింప చేస్తుంది.

**77. ఓం దాన ధర్మ పరాయణాయ నమః**

శ్రీ గురుదేవులు సర్వధర్మ స్వరూపులు. ధర్మరక్షణకై శరీరధారణ చేసిన సమర్థ సద్గురుదేవులు తమ ధ్యేయ సాధనకై మానావమానములను లెక్కచేయక, తమ శిష్యుల నుండి ఏమీ ఆశించక తమ సర్వస్వాన్నీ శిష్యుల కొరకు ధారపోసే స్వభావం కలవారు. మామూలు మానవులు తమను ఆశ్రయించిన వారికి తమ వద్దనున్న సంపదలో ఏ కొద్ది భాగమో దానమిచ్చి వారి నుంచి తిరిగి ప్రతిఫలాన్ని అపేక్షిస్తారు. కాని శ్రీగురుదేవులు తమను సంపూర్ణముగా శరణాగతి చెంది ఆశ్రయించిన వారికి తమ మోక్ష సామ్రాజ్యాన్నే దానమిస్తారు.

**78. ఓం యదార్థ వాదినే నమః**

శ్రీ గురుదేవుల వాక్కును ఎప్పుడూ సత్యం అనుసరించి ఉంటుంది. ఆయన ఏమి మాట్లాడినా అదే సత్యం అవుతుంది. అంతే కాక ఉద్దండ పండితులకు కూడ అర్థంకాని శాస్త్ర విషయాలలోతులలో దాగివున్న నిజమైన అర్థాన్ని శ్రీగురుదేవులు మాత్రమే వివరించగలరు.

**79. ఓం నిర్లోభాయ నమః**

శ్రీగురుదేవులు ఆత్మజ్ఞాన సంపన్నులు. అట్టి ఆత్మజ్ఞాన నిధి అందరికీ అందవలెననే దీక్షతో, తమ బోధాస్రవంతి ద్వారా ఆ నిధిని అందరికీ అవిరళంగా అందిస్తూ, శారీరక సహజ రుగ్మతలను కూడ లెక్కచేయక తమ సర్వస్వాన్నీ ధారపోస్తూ ఆ విధంగా తమ నిర్లోభత్వాన్ని చాటకనే చాటి చెప్పి అందరికీ ఆదర్శప్రాయులుగా ప్రకాశిస్తున్నారు.

**80. ఓం సదా శివ సమాయ నమః**

శ్రీ గురుదేవులు సదా శివ స్వరూపులు. వారు ఎల్లప్పుడూ మంగళకరమైన వారు. భోళా శంకరులు. తమ శిష్యులు చేసే చిన్నపాటి మంచిపనికి కూడా పొంగిపోయి అమూల్య వరాలను అనుగ్రహిస్తారు. వారి శిష్యకోటి అంతా ఆ విధంగా వారి సాంగత్య భాగ్యమును పొందినవారే.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

గృహ ప్రాంగణాలలో హోమగుండాలలో ఎప్పుడో చేసిన యజ్ఞాల తాలూకు భస్మం గుట్టలు గుట్టలుగా పడి ఉన్నది. ఎవరో బాగా వయోవృద్ధుడైన ద్వారకానగరవాసి వ్రేలుస్తున్న ఆహుతుల యొక్క ధూమం కాబోలు, దూరంగా గాలిలో పైకిపోతూ కనిపిస్తోంది. ముగ్గులు లేని లోగిళ్లలో ఎప్పుడో వేసినటువంటి ముగ్గులు మాసిపోయి కనిపిస్తున్నాయి. కృష్ణుడు, బలరాముడు, సాత్యకి గృహాలపైన ఉన్న బంగారు గోపురాలు అస్తమిత సూర్యుని అరుణ కిరణాల ప్రకాశాన్ని దూరంగా పారద్రోలుతున్నట్లు ఉన్నాయి. ఒకప్పుడు కళ కళలాడుతున్న రాజమార్గాలు ఇప్పుడు వెలవెల పోతున్నాయి. రాజ మార్గానికి ఇరువైపుల నిలబడి ఉన్న స్త్రీలు, పురుషులు అసహాయమైన దృక్కులతో అర్జునుని చూచి, తమ తలలను క్రిందకు దించేస్తున్నారు. అర్జునుడు వారివైపు చూశాడు. వారు చైతన్యం ఉడిగిన వారివలె నిర్జీవంగా నిలబడి ఉన్నారు. వారి కళ్లు గుంటలు పడ్డట్లు ఎక్కడో లోతుకు పోయి ఉన్నాయి. ఎన్నాళ్ల నుంచో స్నానం చేసినట్లు గాని, బట్టలు మార్చుకున్నట్లు గాని కనిపించలేదు.



"దారుకా!" అర్జునుడు పిలిచాడు. ఇది...ఇది ద్వారకేనా? లేక ఇంకెక్కడికైనా తీసికొని వచ్చావా?" దారుకుడు వెనుదిరగకుండానే "పార్థా! ఇది ఆత్మ మహాభినిష్క్రమణ అనంతరం శేషించిన పార్థివ శరీరంలా ఉన్నది. ద్వారకలో ఇంకా మిగిలి ఉన్నవారికి పరిచితమైనదే."

దారుకుని మాటలు ఆకాశంలో లీనమయ్యాయి. అవి అర్జునుడి దాకా చేరనే లేదు. అర్జునుని చెవులలో చిరపరిచితమైన, మేఘ గంభీర ధ్వని "పార్థా! శస్త్రములు దేనిని ఛేదించలేవో, అగ్ని దేనిని కాల్చలేదో, నీరు దేనిని తడుపలేదో, గాలి దేనిని ఎండించలేదో అట్టి ఆత్మ అవినాశి...." వినిపించింది.

ఎవరు? ఎవరిదీ ఈ పరిచిత స్వరం? 36 సంవత్సరాల పూర్వం ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో కృష్ణుడు తనతో అన్న మాటలివి. అదే స్వరం! గాండీవం జారిపోయి, చెమటలతో తడిసిపోయి 'నేను ఈ యుద్ధం చేయను, పూజ్యులను, గురువులను చంపి ఆ నెత్తురుకూడు తినలేను. నా బుద్ధి కార్పణ్యదోషం వల్ల సహజమైన నిర్ణయశక్తిని కోల్పోయింది, నేను నీ శిష్యుడను, నన్ను కరుణించి నాకు ఏది శ్రేయస్సును కలిగిస్తుందో దానిని నీవే నిర్ణయించి చెప్పు' అని తాను శ్రీకృష్ణుడి పాదాలను ఆశ్రయించినప్పుడు, ఆ స్వామి ఆత్మయొక్క అమరత్వాన్ని గురించి చెప్తూ అన్న మాటలివి. ఇప్పుడు ఆ అమరత్వం ఎక్కడ? కాని కృష్ణుడెక్కడ! ఆత్మ ఎక్కడ! కృష్ణుడు ఆత్మకంటె పరుడు. కేవలం పరమాత్మ స్వరూపుడే. ఆత్మ అర్జునుడిది కావచ్చు. దారుకుడుది కావచ్చు. లేదా రథానికి పూన్చిన ఈ అశ్వాలది కావచ్చు. కాని శ్రీకృష్ణుడో! ఆయన సాక్షాత్తు పరమాత్మయే. ఆ పరబ్రహ్మస్వరూపుడు ఇప్పుడు అదృశ్యమైనాడు.

అదృశ్యం కావటానికి ముందురోజు సాయంత్రమే స్వామి దారుకుణ్ణి పిలిచి 'దారుకా! నీవు హస్తినాపురం వెళ్ళి నా మాటలుగా అర్జునునికి చెప్పి అతడిని వెంటనే ఇక్కడికి తీసుకొని రా. నా తదనంతరం ద్వారకను కాపాడే బాధ్యతను నేను అర్జునుడికి అప్పగించినట్లు చెప్పు. తండ్రి వసుదేవుడికి, మాతృమూర్తి దేవకికి నా అంతిమ ప్రణామాలు అందించు' అని ఆజ్ఞాపించాడు.

దారుకుడు స్వామి ఆజ్ఞాపాలన చేసి హస్తిననించి ఇప్పడే తిరిగి వస్తున్నాడు. కాని అతనికి ఇప్పుడు కనిపిస్తున్న ద్వారక తను విడిచి వెళ్ళిన ద్వారకేనా అని అనుమానం కలిగింది. ఇప్పుడు రథంలో శ్రీకృష్ణుడి స్థానంలో అర్జునుడు కూర్చుని ఉన్నాడు. ద్వారక శాపగ్రస్తమైన నగరంలా నిర్జీవంగా కనిపిస్తున్నది. 'దారుకా! రథాన్ని ముందుగా వసుదేవుని నివాస స్థానానికి తీసికొనివెళ్ళు' అన్నాడు అర్జునుడు. దారుకుడు మారు మాటాడక రథాన్ని వసుదేవుని భవనంవైపు తిప్పాడు. నగర వీధులలో ఎక్కడా జనసంచారం లేదు. అక్కడక్కడ పై అంతస్తులలో నగరవాసులు కాంతివిహీనమైన కళ్ళతో శూన్యంలోకి చూస్తున్నారు. అంతటా నిశ్శబ్దం అలముకొని ఉన్నది. ఆ నిశ్శబ్ద నీరవ నిశీథిలో వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దం కూడ వారి చెవులకు పెద్దగా వినిపిస్తున్నది.

- సశేషం

# నారద భక్తి సూత్రములు


- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 47: యో వివిక్త స్థానం సేవతే**

**యో లోకబంధమున్మూలయతి**

**(యో) నిస్త్రైగుణ్యో భవతి**

**(యో) యోగక్షేమం త్యజతి**



తాత్పర్యము: ఎవరైతే ఏకాంత ప్రదేశమును ఎన్నుకొని మనసు భగవానునిపై నిలిపి సాధన కొనసాగిస్తారో, ఎవరైతే లోకబంధనముల నుండి విడివడి త్రిగుణములకు అతీతంగా వుండి, తమ యోగక్షేమముల గురించి కూడా వ్యాకులత చెందరో (అటువంటి వారు తరిస్తారు).

ముందు సూత్రములో వివరించిన సాధనా క్రమమును నారదుల వారు ఈ సూత్రములో కొనసాగిస్తూ సాధకుడి లక్షణాలను తెలియ చేస్తున్నారు. సాధకుడు ఒక ఏకాంత ప్రదేశంలో, నిర్దేశిత సమయంలో, నిష్ఠతో మనసును గురూపదేశము నందు లగ్నము చేసి ధ్యాన నిమగ్నుడై ఉండాలని సెలవిస్తున్నారు. ఇది భగవద్గీతలో మోక్ష సన్యాస యోగములో గీతాచార్యులు వివరించిన శ్లోకమును గుర్తుచేస్తుంది.

**వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।**

**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥**

అంటే ఏకాంత ప్రదేశములో ఉండి ధాన్యంలో నిమగ్నుడై ధ్యాన యోగమును అభ్యసించవలసి వుంటుంది. దానితో పాటుగా సాధకుడు మిగతా యమ నియమాలను కూడా పాటించవలసి ఉంటుంది - ఆహారమును, వాక్కును, కాయమును నియంత్రణలో వుంచాలని గీతాచార్యులు అర్జునుడితో సెలవిచ్చారు. దీని గురించి శ్రీ బాబూజీ మహారాజ్ వారు తెలియ చేస్తూ సాధకుడికి మితాహారం, మిత నిద్ర, మిత భాషణము మూడూ చాలా ముఖ్యమని బోధిస్తూ వాటిని "మిత త్రయములు అయిన మిత్ర త్రయములు" అని తెలిపారు. గురుదేవులు తెలిపిన వీటిని పాటించగలిగిన సాధకుడికి సహజ సిద్ధంగానే లోక

బంధనములనుండి విముక్తి కలుగుతుంది. అదే విషయాన్ని నారదులు **"యో లోకబంధమున్మూలయతి"** అని తెలియజేశారు. అయితే ధ్యానంలో నిమగ్నుడైన తరువాత తైలధార వలే మనసు నిలిపిననాడు బంధాలు వేర్లతో సహా పెకలింపవేయబడతాయి. అది కేవలం గురుకృప వలన మాత్రమే సాధ్యమవుతుంది.

సూత్రము లోని మిగతా రెండు భాగములకు - **"యో నిస్త్రైగుణ్యో భవతి యో యోగక్షేమం త్యజతి"** - కూడా ధ్యానము, సాధనలతో సంబంధం కనిపిస్తుంది. మనసు ఏకాగ్రతను సాధించిన పిమ్మట సాధకుడు త్రిగుణాతీతుడై తన యోగ క్షేమముల గురించి కూడా ధ్యాసను కోల్పోతాడు. ఇది అంత సామాన్య మైన విషయం కాదని, కానీ ఆ స్థితిని పొందమని ఆనాడు గీతాచార్యులు అర్జునుడికి బోధిస్తూ

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥**

అంటూ అర్జునా "నీవు ఈ త్రిగుణములకు అతీతంగా శుద్ధ ఆధ్యాత్మిక చైతన్య స్థితిలో ఉండుము. ద్వంద్వముల నుండి విడివడి, నిత్యమూ పరమ-సత్యంలో స్థితమై ఉండి, మరియు భౌతిక లాభాలు, భద్రతల గురించి పట్టించుకోకుండా, ఆత్మ భావన యందే స్థితుడవై ఉండుము" అని ఆదేశించారు. సాధకుడికి ఆ ఆదేశం పరమావధి కావాలి. అయితే త్రిగుణాతీతం అవ్వడమంటే తన కర్తవ్యమును విస్మరించడం కాదు. భగవంతుడి యందు మనసు నిలిపి కర్తవ్యం నిర్వర్తించడం వలన అహంకారం నశించి ఆ సాధకుడు గుణాతీత స్థితిని చేరుకుంటాడని దీని సారాంశం.

ఆ స్థితిని చేరిన వారికి వారి యోగ క్షేమముల స్పృహ వుండ దనడంలో సందేహం లేదు. యోగ క్షేమముల గురించి కూడా ఆరాట పడని అటువంటి వారి యోగ క్షేమములను నేనే వహిస్తానని భగవానుడు ఆనాడు **"యోగ క్షేమం అహం వహామి"** అని ఇచ్చిన హామీ జగద్విదితమే కదా.

ఈ విధంగా నారదుల వారు ఈ సూత్రములో ధ్యానయోగ సంబంధములైన ఎన్నో రహస్యములను ఆవిష్కరించారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**నవంబర్ 2025**

1 శని: చిలుక ఏకాదశి – ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన.

2 ఆది: క్షీరాబ్ది ద్వాదశి – శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

5 బుధ: కార్తీక పూర్ణిమ – గురుపూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం. జ్వాలాతోరణం.

8 శని: కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 37వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం. ఉ. 9-09 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

14 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ, దీపోత్సవం. శ్రీ గురుసాంప్రదాయములోని వారికి శ్రీ సద్గురు దేవుల మహాపుణ్యారాధన.

15 శని: శ్రీ సద్గురు దీక్షలో ఉన్నవారికి హోమం.

16 ఆది: హోమం పూర్ణాహుతి, దీక్షావిరమణ.

18 మంగళ: మాసశివరాత్రి

20 గురు: అమావాస్య

26 బుధ: మార్గశిర శుద్ధ షష్టి – సుబ్రహ్మణ్య షష్టి

**డిసెంబర్ 2025**

1 సోమ: మార్గశిర శుద్ధ ఏకాదశి – గీతాజయంతి, శ్రీమద్భగవద్గీత పారాయణ, శ్రీ సద్గురు పాదపూజ.

4 గురు: మార్గశిర పూర్ణిమ – దత్త జయంతి, శ్రీ సద్గురు పాదపూజ.

14 ఆది: శ్రీగురుదశమి – శ్రీసద్గురు పాదపూజ

16 మంగళ: ధనుర్మాస వ్రత ప్రారంభం – తిరుప్పావై, ఋషులచరిత్ర, భాగవత ప్రవచనం.

18 గురు: మాసశివరాత్రి

19 శుక్ర: అమావాస్య


25 గురు: క్రిస్మస్ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

28 ఆది: పుష్య శుద్ధ నవమి – శ్రీ రామలక్ష్మీ ప్రసాద మాతాజీ వారి తృతీయ వార్షిక ఆరాధన – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

30 మంగళ: ముక్కోటి ఏకాదశి – ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ.భక్త సమారాధన.

# చంద్రోదయం

- పెనుమాక నాగేశ్వర రావు



**పుట్టింది ఎంతో గొప్ప వంశం**
**చేపట్టింది మరెంతో గొప్ప అంశం**
**విశ్వసించు, తరించు అని చెప్పిన**
**విశ్వమత ప్రవక్త అంశవు**
**శ్రీయుత రాఘవమ్మ చిరంజీవుల తనయవు**

**భక్తజనులకు కల్పవల్లివి**
**జ్ఞానసిరులు అందించే శ్రీవల్లివి**
**ప్రశాంతతనిచ్చే ప్రవల్లికవి**
**ఆశ్రితులనాదరించే తల్లివి**

**పెద్ద మనసున్న మనస్విනివి**
**ఆశ్వయుజ పున్నమి నాడు పుట్టిన చిర యశస్వినివి**
**తామస సంహారం చేసే తపస్వినివి**
**మందస్మిత వదనివి, మహా తేజస్వినివి**

**మీ పుట్టినరోజు మాకు పండుగ**
**ప్రతి రోజూ కావాలి మాకు మీ ఆశీస్సులు మెండుగా**
**దయతో స్వీకరించండి ఈ అక్షర సుమాలను పూ దండగా**
**కలకాలం మీరుండాలి మాకు అండగా**

**7-10-2025 పూజ్య మాతాజీ**
**జన్మదిన శుభ సందర్భంగా శుభాకాంక్షలు,**

**నమస్కారములతో.............**

**పెనుమాక నాగేశ్వరరావు**

# శ్రీ బాబూజీతో నా ప్రయాణం

- జి. విజయకృష్ణ (బుజ్జి)

శ్రీ బాబూజీతో నా ప్రయాణం 1981లో ప్రారంభమైంది. అప్పుడు మా తండ్రిగారు శ్రీ బాబూజీని కలవడానికి మొదటిసారిగా ఆశ్రమానికి వచ్చారు. శ్రీ బాబూజీ దర్శనం చేసుకునే ముందు నా తండ్రి విజయవాడ నుండి ఆశ్రమానికి అనేకసార్లు వెళ్ళాల్సి వచ్చింది. అప్పటికే చాలా ఆలస్యమైందని, మా కుటుంబం వెంటనే ఆశ్రమానికి మారాలని బాబూజీ నాన్నకు సలహా ఇచ్చారు. ఆయన వెంటనే అలాగే చేశారు. అప్పుడు 16 ఏళ్ళ బాలుడిగా, నేను బోర్డింగ్ స్కూల్ నుండి సెలవుల కోసం ఇంటికి వచ్చినప్పుడు ఈ నివాస మార్పు నాకు అస్సలు నచ్చలేదు. నేను నా తల్లిదండ్రులతో ఆశ్రమంలో చేరడానికి నిరాకరించాను. విజయవాడలో ఒంటరిగానే ఉన్నాను. అయితే, 1981 వేసవిలో నా జీవితాంతం గురువుగా మారబోయే శ్రీ శ్రీ శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీని కలవడానికి ఆశ్రమానికి పరుగెత్తాల్సి వచ్చేవరకు, నా కెరీర్ మార్గంలో చాలా మందిని కలిశాను, జ్యోతిష్యులు, సాధువులు మొదలైనవారు (నా తండ్రి కారణంగా).

నా మనసులో వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా చేరాలని గట్టిగా ముద్ర వేసుకున్నాను. అప్పటికి వివిధ సాధువులు, జ్యోతిష్యులు మొదలైన వారిని కలవడం వల్ల నేను బలమైన విమర్శకుడిగా, ఈ సాధువులపై నమ్మకం లేనివాడిని అయ్యాను. అయితే విధి ప్రకారం, సంఘటనలు నా కోరికలకు విరుద్ధంగా మారుతున్నాయి. మొదట నాకు వైమానిక దళం నుండి కాకుండా భారత నావికాదళం నుండి ఆఫర్ వచ్చింది. ఆ సమయంలో ఇది నాకు 'కాదు' అని మాత్రమే అనిపించింది. నాకు సమీపంలోని ఓదార్పు కోసం పరిగెత్తడం తప్ప వేరే మార్గం లేదు, ఇది నన్ను ఆశ్రమానికి తీసుకెళ్లింది. నా మొదటి దర్శనంలోనే, బాబూజీ నా కళ్ళలోకి లోతుగా చూస్తున్న అనుభూతిని చెందాను. ఈ మొదటి చూపులోనే ఏ శక్తి నా మనస్సును అధిగమించిందో నాకు తెలియదు, అది నన్ను తక్షణమే ఆయన పాదాలపై పడి నేటి వరకు అలాగే వుండమని ప్రేరేపించింది, శారీరక రూపంలో కాకపోయినా.

తర్వాత నా గురుదేవుల సూచనల ప్రకారం నేను ఇండియన్ నేవీలో చేరాను, అయినప్పటికీ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్ పైలట్ కావాలనే బలమైన కోరిక అలాగే ఉంది. నేవీలో చేరిన తర్వాత కూడా నేను పైలట్‌గా వెళ్ళడానికి చాలా ప్రయత్నాలు చేశాను, కానీ నా గురుదేవులు నా అల్లరి అంతా అణిగేలా చూసుకున్నారు. ఆయన సూచనలు స్పష్టంగా ఉన్నాయి, నేను నేవీలో ఇంజనీర్ అవుతానని. నా మనసులో ఎంత అల్లరి ఉన్నప్పటికీ, అది అలాగే జరిగింది.

ఈ మధ్య సంవత్సరాల్లో, నా వృత్తి స్వభావం కారణంగా, 1988లో గురుదేవులు వారి శరీరం నుండి నిష్క్రమించే వరకు, ఆశ్రమానికి నేను అప్పుడప్పుడు సందర్శనలు చేయడంతో పాటు, క్రమం తప్పకుండా లేఖల ద్వారా నా గురువుతో సంబంధాలు కొనసాగించాను. అయితే, “బాబు విజ్ఞాన మందిర్” నివాసం నాకు శాశ్వత ప్రేరణగా నిలిచింది మరియు లక్ష్మీ అక్క యొక్క నిరంతర మార్గదర్శకత్వం ద్వారా నేను ఒక పామరుడి నుండి ఏకాగ్రత కలిగిన డేగగా మార్చబడ్డాను. గురువుపై ఆమెకున్న విశ్వాసం రాతికంటే దృఢమైనది. ఈ ప్రపంచంలో గురుదేవుల దయ తప్ప మరేమీ లేదని ఆమె నా మనసుపై బలంగా ముద్రవేసింది.

సాయుధ దళాలలో సహజంగానే నేను ఫిట్‌గా ఉన్నాను మరియు ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ ఫ్రీక్‌గా ఉన్నాను. అవకాశం వచ్చినప్పుడు ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ గురించి ఇతరులకు ఉపన్యాసాలు ఇచ్చే అవకాశాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. కానీ నా ప్రపంచం తలక్రిందులైంది, ఆ తర్వాత జరిగిన సంఘటనలను స్పష్టత మరియు ప్రభావం కోసం కాలక్రమానుసారంగా వివరిస్తాను.

ఆగస్టు 2023: నేను అస్సలు ఊహించని విధంగా నాకు మొదటిసారి గుండెపోటు వచ్చింది. నాకు స్టెంట్ అమర్చారు. నా విధి మళ్ళీ తారుమారైనప్పుడు నేను నా పరిస్థితికి అనుగుణంగా మారాను మరియు ఫిట్‌నెస్ పట్ల నాకున్న మక్కువను మరింత తీవ్రంగా కొనసాగించాను.

- సశేషం

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

ఎచ్చోట గాంచిననూ మాడభవంతులే! వానికి తోడు గోపురములు. సువాసన పూరిత పుష్పములతో నిండిన వుద్యాన వనములు. పలు విధములైన పక్షుల కిలకిలారావములు. పలు పక్షులు ఆడుకొనుచుండు కొలనులు. వీటన్నింటితో నిండియున్న ఆ ప్రదేశమును గాంచి, "దీనినే స్వర్గపురమందురా!?" అని హనుమంతుడు సంభ్రమాశ్చర్యం చెందాడు. అవ్విధముగ ఆ భవనములను వెదకుచు పోవుచున్న హనుమంతుడు, రావణునిచే చెరపట్టబడిన దేవతలు, యక్షులు, కిన్నెర, కింపురుష, విద్యాధర స్త్రీలు రాక్షసులకు, రాక్షసస్త్రీలకు సేవ చేయుచుండు దుఃస్థితిని చూచాడు. రావణుని సహోదరులైన కుంభకర్ణుడు, విభీషణుడు మరియు ఆతని పుత్రులైన ఇంద్రజిత్తు, అక్ష కుమారులుండు భవనములందు వెదికాడు. విభీషణుడు మాత్రం నిద్రించకుండా 'అన్నగారు అన్యుల భార్యను ఎందులకు అపహరించి బంధించియుంచి ఈ పాపకార్యమునకు ఒడికట్టారు? దీని పరిణామం ఎంత విపరీతంగా ఉంటుందో?' అని వ్యధచెందుతూ ఉండగ, ఇతరులు మాత్రం ఎట్టి బాధలేక హాయిగ నిద్రించుటను హనుమంతుడు గమనించాడు.

పిదప రావణుని భవనములోనికి ప్రవేశించిన హనుమంతుని దృష్టి అంతఃపుర నడుమ నిద్రించుచున్న మండోదరిపై పడింది. ఒక్క క్షణం ఆమె సీత అయ్యుంటుందా? అను సందేహం కలిగింది. కాస్త ముందుకు వెళ్ళి చూసిన పిదప ఆమెను సీతగ భావించి తాను తప్పు చేసాడని గ్రహించిన హనుమంతుడు 'ఎంతటి విపరీతమైన తలంపో!?' అని స్వగతమున తలచి తన నెత్తిపై ఒక మొట్టికాయను వేసుకున్నాడు.

సాయం సమయం కావచ్చింది. సీతఎక్కడా కానరాకుండుటచే, ఒక చెట్టు కొమ్మపై కూర్చుని, "ఇప్పటి వరకు నేను చేసిన ప్రయత్నమంతా వృధాయేనా!? గ్రద్దపక్షులకు నాయకుడైన సంపాతి లంకానగరమందు సీతను తాను చూసినట్లు చెప్పాడే? ఆతని మాటలు కూడ అర్థం లేకుండా

పోయాయి. ఈ లంకా మహానగరమందు సీతను వెదుకలేకపోయిన నేను ఇంకా ఈశరీరమందు ప్రాణములతో ఉండి ఇలా కష్టపడ వలసిందేనా?' అని అనుకుంటూ కన్నీరు మున్నీరై విలపించాడు హనుమంతుడు.

అదే సమయమున ఆతని మనస్సాక్షి ఆతనిని తట్టిలేపింది. 'వుత్సాహమును ఎన్నటికీ విడువవలదు' అని బుద్ధిచెప్పింది. అలా అంతరాత్మచే ప్రేరేపించబడిన హనుమంతుడు మరల తన కర్తవ్యమును కొనసాగించ ఉపక్రమించాడు. తమ ప్రత్యక్ష దైవమైన రాముడు, లక్ష్మణుడు, జానకి మొదలైన ప్రథములను, రుద్రుడు, ఇంద్రుడు, వాయువు, యముడు, చంద్రుడు, సూర్యుడు, మరుద్గణములైన దేవతలను తలచి, 'ఇకపై మీరే నాకు సహకరించ వలయును' అని ప్రార్థించాడు. దాని ఫలితమో ఏమో గాని పడమట పూర్ణచంద్రుడు వుదయించాడు. ఆప్రకాశముచేత ఆతడు అశోకవనమును చూడ గలిగాడు. "ఆహా! ఈ వనమును మనము చూడనే లేదే!" అనుకుని అటువైపు పయనించాడు.

ఒక చెట్టు ఆకుల నడుమ దాక్కుని, రాక్షస స్త్రీలచే సీత బాధింపబడు విధమును చూసాడు. సీత పడుచున్న వ్యధను గాంచిన హనుమంతుడు మిక్కిలి ఆగ్రహావేశంతో ఆ రాక్షస స్త్రీలవైపు చూసాడు. వారొక్కక్కరూ భయంకరమైన రూపము గలవారై ఉన్నారు. ఈ రాక్షస స్త్రీలందరినీ సంహరించి, సీతను కాపాడవలయునని హనుమంతుడు తలచుచుండగ, ఆ అశోకవనమందలి సీతవద్దకు రావణుడు వచ్చాడు.

అలా వచ్చిన ఆ రాక్షసరాజు, సీతాదేవిని జూచి, "నా మనస్సును కొల్లగొట్టినదానా! నన్ను ఎందులకు ఇలా చిత్రవధ చేస్తున్నావు? నా పది శిరస్సులను నీ పాదముల చెంతనుంచ నేను సిద్ధముగ నున్నాను. నన్ను ఓడించువారు ముల్లోకములందు ఎవ్వరూ లేరు. సామగానం పాడి ఆ పరమేశ్వరుని అనుగ్రహముచే పొందబడిన కరవాలముచే ఎంతటి శతృవునైననూ సంహరించగలను. రాజ్యమును వీడి ఒంటరిగ అడవులను పట్టి జీవనమును సాగించుచున్న నీ భర్త నన్నేమీ చేయలేడు. కడు తీవ్రమైన సైన్యము చుట్టూ తిరుగుచుండగ ఆతడు ఈ లంకానగరము లోనికి ప్రవేశింప సాధ్యమైన కార్యము కాదు. ఆ మానవ

కీటకమును మరచిపొమ్ము. నన్ను చేరుకొనుము. నిన్ను ముల్లోకములకు మహారాణిని గావించెదను" అని బ్రతిమలాడాడు.

ఆ అసురుని ముఖమును చూడకుండా, ఒక గడ్డి పరకను రావణునికి, తనకు మధ్య నాటి, దానిని చూస్తూ సీత ఇలా సమాధాన మిచ్చింది. "సామగానం పాడి శివుని అనుగ్రహము పొందితివని చెప్పుచుంటివే! సామవేదమును అభ్యసించిన వారెవరూ ఇవ్విధముగ అన్యుల భార్యలను అపహరించుకుని వచ్చి ఇలా బంధించియుంచి, తగాదా పెట్టుకోరు! నా భర్త శ్రీమహావిష్ణువును ఆరాధించిన వారు. నీ వంటి నక్కలను కడు సులభముగ జయించగలరు. అందుచేతనే నీవు ఆయన లేని సమయమును చూసి, కపట సన్యాసి వేషమును దాల్చి, నన్ను మోసగించి, అపహరించి తీసుకుని వచ్చావనుకుంటాను. నీకు అదుపాజ్ఞలు, లజ్జ అటువంటివి ఏమియూ లేవా!? నాభర్త ఒక్కడే జనస్థానమందు పధ్నాల్గు వేల సైనికులు గల నీ సహోదరులైన ఖరుడు, దూషణుడు మరియు త్రిశిరులను సంహరించి పిండి పిండి చేసాడు!" "నీ మరణ గడియలు సమీపించుచున్నవి. నీవు, నీ అసుర కులము నాశనము కాకుండ వుండవలయునన్నచో నా నాథుని వద్దకు నన్ను చేర్చి శరణు వేడుకొనుము" అని రాముని పరాక్రమమును, శరణు కోరిన వారికి అభయమొసగి రక్షించు స్వభావమును పలుమార్లు వివరించి, సీత రోదనచే ఎరుపెక్కిన తన ముఖమును మూసుకుంది.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తురాలు, భీమవరం వాసులు అయిన కుమారి పాలూరి శ్రీదేవి గారు 23-9-2025 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**నవంబర్ 2025**

1 శని: చిలుక ఏకాదశి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

2 ఆది: క్షీరాబ్ది ద్వాదశి – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

5 బుధ: కార్తీక (గురు) పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

8 శని: శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం.

14 శుక్ర: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 బుధ – సుబ్రహ్మణ్య షష్టి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**డిసెంబర్ 2025**

1 సోమ: గీతాజయంతి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

3 బుధ: శ్రీగురుదేవులు స్వస్వరూప లయం చెందిన తేదీ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

4 గురు: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

25 గురు: క్రిస్మస్ – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

30 మంగళ: ముక్కోటి ఏకాదశి. – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

## శ్రీ మాతాజీ కార్యక్రమములు

6-11-2025 గురువారం శ్రీ కాళీప్రసాద ఆశ్రిత ఆశ్రయం, నందికొట్కూరు, 4వ వార్షికోత్సవములో పూజ్య శ్రీ మాతాజీ వారి సత్సంగం.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**స్వదేశికస్యైవ చ నామకీర్తనం భవేదనంతస్య శివస్యకీర్తనం।**
**స్వదేశికస్యైవ చ నామచింతనం భవేదనంతస్య శివస్య చింతనం॥32**

**<u>పదవిభాగము</u>** :-

స్వ-దేశిక, స్య-ఏవ-చ-నామకీర్తనం-భవేత్-అనంతస్య-శివస్య కీర్తనం-స్వ-దేశికస్య ఏవ-చ-నామచింతనం-భవేత్-అనంతస్య-శివస్య-చింతనం.

**<u>టీక</u>** :- స్వ=తన; దేశికస్య=గురుదేవుని; నామకీర్తనం ఏవ= నామాన్ని కీర్తించటమే; అనంతస్య= అనంతుడైన; శివస్య=శివుని; కీర్తనం=కీర్తించటం; భవేత్=అగును; స్వ=తన; దేశికస్య= గురుదేవుని; నామచింతనం= నామమును ధ్యానించుటయే; శివస్య=శివుని; చింతనం భవేత్=అగును.

**<u>వ్యాఖ్య</u>** :- "తన గురుదేవుని నామ కీర్తనమే అనంతుడైన శివుని కీర్తించటం, తన గురుదేవుని నామాన్ని చింతంచటమే అనంతుడైన శివుని చింతించుట అవుతుంది" అని సాధకుడు బ్రహ్మమయుడు కావటానికి ఉపయుక్తమైన సాధనా విధానం యిక్కడ తెలియజేయబడింది. ఇంతకు ముందు (20వ శ్లోకంలో) గురువుకూ శివుడికీ బేధం లేదనీ, అలా భేదం ఉన్నదని, తలచిన వాడు మహాపాపి అవుతాడనీ చెప్పబడింది. సాధకుడు బ్రహ్మమయుడు కావటానికి చేయవలసిన సాధన పై శ్లోకంలో చెప్పబడినది. వానిలో భగవన్నామ కీర్తన, స్మరణా ముఖ్యమైనవని యిక్కడ మళ్ళీ నొక్కి చెప్పబడుతున్నది. శివుడు కేవలము అమూర్తము, గురుదేవుడు మూర్తా మూర్తముగా భాసిస్తున్నాడు. ఈ యిర్వురిలో మూర్తా మూర్త స్వరూపమును కీర్తించుట, చింతించుట సులభము. ఈ విషయాన్నే భగవద్గీతలో

*క్లేశో౽ధికతరస్తేషామవ్యక్తా సక్త చేతనామ్*
*అవ్యక్తాహి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే.* (12-5)

అమూర్తమైన నిర్గుణ పరబ్రహ్మమునందాసక్తి గల మనస్సు గల వారికి సగుణోపాసకుల కంటే చాలా క్లేశము గలుగుతుందనీ, దేహాభిమానము గల వారికి మూర్తమైన గురుధ్యానము అనుకూలంగా ఉంటుందనీ తెలియజేయ బడింది. అక్కడ అర్జునునకు నిర్గుణతత్త్వము అమూర్తము, ఆయున

గురుదేవుడైన శ్రీకృష్ణ పరమాత్మ మూర్తము. అందుచేత "**మయ్యేవ మన ఆధత్స్వ**" అని అర్జునునికి బోధించాడు స్వామి.

ఈ విషయాన్ని గురించే బోధ చేస్తూ శ్రీ బాబూజీ వారు యిలా అంటారు. "సద్గురువు పరమాత్మ స్వరూపుడు, భగవానునికి ఆయనకు భేదం లేదు. అహంకార మమకారములను జయించి ఆనందానుభూతిని అనుక్షణం పొందే అనుభవస్వరూపుడైన ఆ సద్గురుదేవుని ఆశ్రయించి అచంచల విశ్వాసంతో ఆయన కృపను పొందగలిగితే ఆయన కృపాళువై తన వద్దనున్న జ్ఞానాంజనాన్ని మన కనులకు ఒక్కసారి తాకిస్తారు. అంతే! అహంకారపు పొరలు తొలగి ఆత్మ వస్తువు నీలోనూ సర్వత్రా దర్శనమౌతుంది" (గురువాణి, పేజి 167)

**యత్పాదాంబుజ రేణుర్వై కోఽపి సంసార వారిధౌ**
**సేతుబంధాయ తే నాథం దైశికం తముపాస్మహే.** 34

<u>**పదవిభాగము**</u> :-

యత్-పాదాంబుజ రేణుః-వై-అపి-సంసార వారిధౌ-సేతు బన్ధాయతే- నాథం -దైశికం-తం-ఉపాస్మహే.

<u>**టీక**</u> :- యత్=ఏ గురుదేవుని యొక్క; పాదాంబుజ= పాదపద్మ; రేణుః=పరాగ కణము; (ఏ) కోఽపి= ఒక్కటైనా కూడా; సంసార వారిధౌ= సంసార సముద్రమునకు; సేతుబంధాయతే= వారధి అవుతున్నదో; తం=అట్టి; నాథం=ప్రభువగు; దైశికం=గురుదేవుని; ఉపాస్మహే=ఉపాసించుచున్నాము

<u>**వ్యాఖ్య**</u> :- "ఏ గురుదేవుని పాద కమలము నందున్న ఒక్క పరాగ కణమే సంసార సాగరాన్ని తరించే వారధి యగుతున్నదో అట్టి ప్రభువగు గురుదేవుని ఉపాసిస్తున్నాము" అని అర్థం. చాలా సున్నితంగా "సేతు బంధాయతే" అనే మాటలలో శ్రీమద్రామాయణ మహాకావ్యాంతరార్థాన్ని సూచిస్తూ తన ఆరాధ్య గురుదేవుడైన రామచంద్రుడిని స్మరిస్తున్నాడిక్కడ పరమ శివుడు. గురుదేవుడైన రామచంద్రుడి పాద కమలాలను ఆశ్రయించి, ఆయన చూపించిన వారధి మీదుగా సంసార సముద్రాన్ని దాటిన ఆంజనేయుడనే సాధకుడు రావణుడనే రాక్షస ప్రకృతిని అధిగమించిన సంఘటన యిచ్చట వ్యంగ్యంగా తెలియజేయ బడుతున్నది. అయితే అక్కడ రామచంద్రుడు ఇతరుల సహాయంతో వారధి నిర్మిస్తే, ఇక్కడ గురు పరమాత్మ పాద పరాగ రేణు మాత్రం చేతనే ఆ కార్యం

చక్కబడగలదనటం కవితా చమత్కారము.

**యద నుగ్రహ మాత్రేణ శోకమోహౌ వినశ్యతః**
**తస్మై శ్రీ దేశికేంద్రాయ నమోఽ స్తు పరమాత్మనే॥ 35**
**యస్మా దనుగ్రహం లబ్ధ్వా మహదజ్ఞానముత్సృజేత్।**
**తస్మై శ్రీ దేశికేంద్రాయ నమశ్చా భీష్ట సిద్ధయే॥ 36**

<u>**పదవిభాగము**</u> :-
యదనుగ్రహమాత్రేణ-శోకమోహౌ-వినశ్యతః-తస్మై-శ్రీదేశి కేంద్రాయ- నమోస్తు-పరమాత్మనే. 35
యస్మాత్-అనుగ్రహంలబ్ధ్వా-మహత్-అజ్ఞానం-ఉత్సృజేత్- తస్మై- శ్రీదేశి కేంద్రాయ- అభీష్ట సిద్ధయే-నమః 36

<u>**టీక**</u> :-యదనుగ్రహమాత్రేణ=ఏ గురుదేవుని అనుగ్రహ మాత్రం చేత; శోకమోహౌ=శోక మోహాదులైన ద్వంద్వాలు; వినశ్యతః=సంపూర్ణముగా నశించుచున్నవో, తస్మై= అటువంటి; శ్రీదేశి కేంద్రాయ= శ్రీ గురుదేవులకు; నమః= నమస్కారము; అస్తు= అగుగాక; యస్మాత్= ఏగురుదేవుని; అనుగ్రహం లబ్ధ్వా=అనుగ్రహమును పొందగా, మహదజ్ఞానం= గొప్ప అజ్ఞానము; ఉత్సృజేత్= తొలగిపోతుందో; తస్మై=అటువంటి; శ్రీదేశికేంద్రాయ=శ్రీ గురుదేవులకు; అభీష్టసిద్ధయే=బ్రహ్మాత్వ సిద్ధికొరకు, నమః=నమస్కారము.

<u>**వ్యాఖ్య**</u> :- "ఏ గురుదేవుని అనుగ్రహ మాత్రంచేత శోకమోహాది ద్వంద్వాలు నశిస్తాయో, గొప్పదైన అజ్ఞానం తొలగిపోతుందో, అటువంటి గురుదేవునకు నమస్కారము అని, తన నమస్కారం ఎవరి కొరకో తెలియజేస్తున్నాడు పరమశివుడు. ఇంతకు ముందు సాధకుడైన శిష్యుని మలదోషం నివర్తించాలనే అభీష్టంతో నమస్కరిస్తున్నట్లు చెప్పబడినది (29వ శ్లోకంలో) ద్వంద్వముల వలన విక్షేపం కలిగి ఏకాగ్రతకుదరదు, ఉపాసన వలననే విక్షేప దోషం నివర్తిస్తుంది. మల విక్షేపములు భగవదుపాసనతో తొలగితే తొలగవచ్చునుగాని, ఆవరణ దోషం మాత్రం గురూపదిష్ట మంత్రం వల్లనే నశిస్తుంది. అజ్ఞానమే ఆవరణ. ఆ ఆవరణను తొలగించే గురుపాదాలకు నమస్కారం అనటం వల్ల "శ్రీగురుగీత" ఎలా మోక్షోపాయ శాస్త్రమో వెల్లడి అవుతున్నది.

- సశేషం

# రాధ – దుర్గ

- భాగవతుల హనుమత్ జయప్రద

**"జగన్మాతాచ ప్రకృతిః పురుషశ్చ జగత్పితా**
**గరీయసీతి జగతాం మాతా శతగుణైః పితుః"**

"ప్రకృతి జగత్తుకు తల్లి, పురుషుడు జగత్తుకు తండ్రి. జగత్పిత కన్నను, జగన్మాత శతాధికముగా శ్రేష్ఠురాలు"

ప్రపంచంలోని సకల శక్తుల మూలాధారం ఆదిశక్తి. ఈ ఆదిశక్తి అనేక రూపాల్లో ప్రత్యక్షమవుతూ సజీవ జగత్తుకు దివ్య సందేశాన్ని అందిస్తుంది. శ్రీ దేవీ భాగవత పురాణంలో ఈ ఆదిశక్తి రెండు ప్రధాన రూపాలుగా వ్యక్తమైనది అవే రాధ మరియు దుర్గ.

శ్రీకృష్ణుని కుడి భాగమునుండి ప్రాప్తమయిన రూపం రాధ అని పిలువబడింది. శ్రీ రాధాదేవి, గోపికలలో ఒక గోపిక కాదు. ఏ దేవి చరణధూళిని శిరమున ధరించుట చేత గోపికలు ఆ శ్యామసుందరుని చేత కూడా కోరుకొన దగినవారు అయినారో, ఏ సర్వేశ్వరీ కటాక్ష వీక్షణాల రససంజీవిని స్పర్శ చేత శ్రీ కృష్ణుడు ముగ్ధుడు అవుతున్నాడో, ఏ రాసేశ్వరి పాదస్పర్శను ఆ పురుషోత్తముడు సదా కాంక్షిస్తూ ఉంటాడో, అటువంటి రాధ, ఒక గోపిక ఎలాగ అవుతుంది?

రాధాదేవి సర్వోత్కృష్టమైన చూడామణి వంటిది. రాసక్రీడలో గోపికలందరికీ జీవస్వరూపం రాధ. కృష్ణుని ప్రతి లీలలోనూ రాధా శక్తి అంతర్యామి. రాసలీలలో కృష్ణుడు ప్రతి గోపికతో ఉండినప్పటికీ, ప్రతి గోపిక హృదయంలో రాధానే చూడగలిగాడు. అందుకే ఆమెను రాసేశ్వరి అని పిలుస్తారు. లౌకికబంధము కంటే, అమ్మతో ఉండే అలౌకిక ప్రేమ సంబంధము దృఢమైనది, శాశ్వతమైనది.

దుర్గా దేవి కూడా అదే ఆదిశక్తి యొక్క విభిన్న రూపం. ఆమెను దేవీ భాగవతంలో జగదంబగా, పరాశక్తిగా వర్ణించారు. ఆమె రక్షణకు, శక్తికి, ధైర్య సాహసాలకు ప్రతీక. మనలోని మహిషాసురుడిని సంహరించడానికి ఎదురయ్యే భయాలు, సంకటాలు, వాటిని అధిగమించడానికి కావల్సిన సాహసాన్ని, బలాన్ని, స్థిరత్వాన్ని దుర్గా దేవి ప్రసాదిస్తుంది. రాధ లేకపోతే మనం నిజమైన ప్రేమను, భక్తిని

అనుభవించ లేము. దుర్గ లేకపోతే మనం ఆ ప్రేమను కాపాడుకోలేము. కాబట్టి ఈ రెండు రూపాలు భక్తుని జీవనంలో సమానంగా అవసరమైనవే. రాధ మనకు అహంకార రహిత ప్రేమను నేర్పుతుంది. దుర్గ మనకు భయరహిత జీవనాన్ని ప్రసాదిస్తుంది.

**లోకమంతయు నిండియున్న నీదు తేజము । ఏకదైవము నీవెయని చాటుతున్నది**

**పరాశక్తి కరుణచూపి ఆదరించవా । నా హృదిని ప్రేమతో నింపివేయవా**

# పసి [డి] మనస్సు

దేవుడి ఊరేగింపు వస్తుందని యింట్లోవాళ్ళు పళ్ళెంలో పళ్ళు, కొబ్బరికాయ, బియ్యం, బెల్లంముక్క, పూలు అన్నీ సర్ది బల్లమీద పెట్టారు. ఆ యింట్లోని పసిపాప 'అమ్మా! అవన్నీ ఎందుకు?' అని తల్లిని ప్రశ్నించింది. "దేముడు వస్తాడమ్మా! వచ్చినప్పుడు యివన్నీ యివ్వాలి. గుమ్మంలో నిలబడి చూస్తూ వుండు" అన్నది తల్లి.

చిట్టిపాప గుమ్మంలో నిలబడింది. ఎంతకీ రాలేదు దేవుడు. వీధి గడప మీద కూర్చుని యెదురు చూస్తోంది. ఇంతలో చింకిబట్టలు చింపిరిజుట్టు, చేతిలో బొచ్చె పట్టుకుని ఒక ముసలి ముష్టివాడు వచ్చాడు. ఠకీమని పాప లేచి నిలబడి 'నువ్వేనా ఆ దేవుడివి?' అని అడిగింది వాడిని. వాడు అవును కాదు అనకుండా లోపలికి తొంగి చూస్తూ "ఆకలి వేస్తోంది. ఏమైనా వుంటే తినడానికి పెట్టండమ్మా!" అని కేక పెట్టాడు.

'పాపం! దేవుడికి ఆకలివేస్తోందిట' అని ఆ చిన్ని పాపకు జాలి వేసింది. 'తనకి ఆకలివేస్తే అమ్మ అన్నం పెడుతుంది కదా' అనుకుంటూ, 'ఉండు. నీ కోసమే పళ్ళెంలో అన్నీ పెట్టారు.' అంటూ గబగబా వెళ్ళి పళ్ళెం తెచ్చి వాడికివ్వబోయింది. ముష్టివాడే కాని, మోసం చేసేవాడు కాదు వాడు. చాలా మంచివాడు. పాప అమాయకత్వానికి వాడికి ముచ్చట వేసింది. పళ్ళెంలో పళ్ళు మాత్రమే తీసుకుంటూ "నాకివి చాల్లే తల్లీ! శాన్నాళ్ళు బతుకు!" అని దీవిస్తూ వెళ్ళిపోయాడు.

'దేవుడొచ్చి ఆకలేసిందని, పళ్ళు చాలని తీసికెళ్ళాడమ్మా' అని సంబరంగా కేక పెట్టింది చిట్టిపాప. దేవుడు ఎక్కడి నుంచో రానక్కర్లేదు. అటువంటి పసి హృదయాలలోనే దైవం నెలకొని ఉంటాడు. అందుకే '**బాలోన్మాద పిశాచవత్**' లా వుంటారు పరమహంసలైన జ్ఞానులు. వారు అన్నిటా, తమలో నిత్యమూ దైవాన్ని దర్శిస్తూనే వుంటారు. ఆనందంలో ఓలలాడుతూ వుంటారు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ గండికోట వేంకటేశ్వర్లు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

"నేను స్వభావతః సోషలిస్టు సిద్ధాంతాలను నమ్మినవాడను. నా జీవితంలో కూడా ఆ సిద్ధాంతాలకు అనుగుణంగానే నడుచుకుంటూ వస్తున్నాను. తోటి మానవులను, తనను తాను ప్రేమించుకున్నట్లే ప్రేమించవలెనని, తరతమ భేదములు లేకుండా అందరినీ సమానంగా గౌరవించ వలెనని, అప్పుడే సమాజంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందని నా అభిప్రాయము. తమ బోధలోనే గాక ఆచరణలో కూడా నా యీ సిద్ధాంతాలు అత్యున్నత ప్రమాణాలలో పాటించబడటం నేను గమనించాను. అందుకని మీకు హృదయ పూర్వకంగా నమస్కరిస్తున్నాను." శ్రీ గండికోట వెంకటేశ్వర్లు గారు శ్రీబాబు వద్దకు వచ్చి వారికి నమస్కరించకుండానే నెల రోజులుండి, వారితో బాటు రాజమండ్రి, భీమవరం, జువ్వలపాలెం భక్తులతో కలిసి వెళ్ళి, అన్ని కార్యక్రామలను గమనించిన తరువాత మొదటిసారిగా నమస్కారం చేస్తూ అన్న మాటలివి.



గండికోట వెంకటేశ్వర్లుగారు మద్రాసులో ఆంధ్రప్రభ ఛీఫ్ సబ్ ఎడిటర్‌గా పని చేసేవారు. శ్రీ బాబు 'పెద్ద మామయ్య' గారైన వారణాసి సుందర రామయ్యగారి పెద్దల్లుడు. వారి ధర్మపత్ని శ్రీమతి కాళీ సరోజినిగారు గురు సంప్రదాయంలోని వారు. వెంకటేశ్వర్లుగారు తమ ధర్మపత్నిని శ్రీ బాబు పూజలకు వెళ్ళటానికి అభ్యంతర పెట్టేవారు కాదు. కాని తాము వెళ్ళటానికి యిష్టపడేవారు కాదు.

ఒకసారి వెంకటేశ్వర్లు గారు శ్రీ సీతారామయ్యగారిని (బుల్లి మామయ్య) చూడాలని వడాలి వెళ్ళారు. వారు రాజమండ్రి జయంతులకు వెళ్ళారని, అక్కడ వారికి సుస్తీగా ఉందని తెలిసింది. రాజమండ్రి వెళ్ళి తన పినమామ గారిని చూసి వెళ్ళిపోదామని (జయంతుల కోసం కాదు) వెంకటేశ్వర్లుగారు రాజమండ్రి వెళ్ళారు. సీతారామయ్యగారు శ్రీ బాబుకు వారిని పరిచయం చేసినప్పుడు వెంకటేశ్వర్లు గారు నమస్కరించ లేదు, శ్రీ బాబు మాత్రం ఎంతో ఆత్మీయంగా "తమరు మాకు వరుసకు సోదరు

లొౌతారు. మా బుల్లి మామయ్య కోసం వచ్చి, మాకు కూడ మీ దర్శన భాగ్యం కలిగించారు. జయంతులు అయిపోతున్నాయి. జగన్మాత తన బిడ్డలపైన ఎనలేని అనుగ్రహాన్ని వర్షిస్తున్నది. జయంతులు అయిపోయే వరకు తమరు ఉండి, యీ ఉత్సవాలలో పాలు పంచుకోగలిగితే యీ మీ సోదరుడికి ఎంతో సంతోషం కలిగించిన వారవుతారు'' అని అన్నారు. “అలాగే'' అని వెంకటేశ్వర్లు గారు అసంకల్పితంగానే అనేశారు. తరువాత ఆయనకే ఆశ్చర్యం కలిగింది. “ఎన్నడూ, ఎక్కడా, ఏకారణం చేత కూడా సెలవు పొడిగించి యిలా వుండిపోవటానికి సమ్మతించలేదు. ఇదేమిటి? ఇలా వారు అడగగానే ఒప్పేసు కున్నాను? వారి మాటలలో ఏదో ఆకర్షణ ఉంది'' అనుకున్నారు. సెలవు పొడిగించారు. శ్రీ బాబుకు నమస్కారం మాత్రం చేయలేదు.

జయంతులయిపోగానే శ్రీ బాబు భీమవరం వెడుతూ “నాతో భీమవరం వచ్చెయ్యండి. అక్కడి నుంచి మద్రాసు వెళ్ళిపోవచ్చు''నన్నారు. వెంకటేశ్వర్లుగారు కాదనలేక పోయారు. భీమవరం వెళ్ళారు. ఎందరెందరో భక్తులు వస్తున్నారు. వారి భక్తి ప్రపత్తులు, శ్రీ బాబు వారితో మాట్లాడుతున్న తీరు, తాతయ్య గారింట్లో భక్తులకు లభిస్తున్న ఆత్మీయమైన ఆతిథ్యము, అందరు భక్తులు అన్ని పనుల్లో పాల్గొనటము, అన్యోన్యత యివన్నీ గమనిస్తున్నారు గాని, వెంకటేశ్వర్లుగారు శ్రీ బాబుకు నమస్కరించనూ లేదు. అలాగని సెలవూ అడగ లేదు. ఎప్పుడన్నా అడిగినా, “వెళ్ళిపోతారా?'' అని శ్రీ బాబు అనేసరికి ఆగిపోయేవారు. ఇనుమడించిన ఆశ్చర్యంతో, తనను కట్టి పడవేస్తున్న యీ ఆకర్షణకు మూలమేమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో వారు మళ్ళీ సెలవు పొడిగించారు.

ఇంచుమించు నెలరోజులు గడిచి పోయాయి! ఇక సెలవు పొడిగించటం సాధ్యం కాదనుకుంటుండగా, దగ్గరలో ఉన్న జువ్వలపాలెం నుంచి భక్తులొకరు శ్రీ బాబును భక్తులందరితో సహా ఆహ్వానించి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన చేసుకున్నారు. వెంకటేశ్వర్లుగారిని కూడా శ్రీ బాబు తీసుకుని వెళ్ళారు. ఆహ్వానించిన వారు చండశాశనులని, ఎవరితో మాట్లాడినా చేతిలో తుపాకి ఉంచుకునే మాట్లాడేవారని, అందుకని వారిని తుపాకీ రాజు గారని అందరు అనేవారని, కాని యిప్పుడు శ్రీ బాబు వద్దకు వచ్చిన అనంతరం చాల మారిపోయారని, తెలిసిన వారు చెప్పారు. 'అదేమిటో చూడవలసిందే' అనిపించి జువ్వలపాలెం వెళ్ళారు వెంకటేశ్వర్లుగారు.


- సశేషం

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# భక్త పోతన

క్రీ.శ. 15వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధ భక్తకవి పోతన. వరంగల్ మండలంలోని బమ్మెర గ్రామంలో వీర శైవ కుటుంబంలో జన్మించాడు. భాగవతంలో పోతన పేరుకు అమాత్య పదము చేర్చబడి ఉండటం వల్ల అతడు నియోగి బ్రాహ్మణుడు అని అనుకోవచ్చును. అతడు సంస్కృతాంధ్ర భాషలను తన తండ్రి వద్దనే నేర్చుకొన్నట్టు తెలుస్తోంది. సోమశేఖరుడు అతని మత గురువు. విద్యాభ్యాసానంతరం తన స్వగ్రామానికి వచ్చి హాలిక జీవితాన్ని గడిపాడు. మహాభాగవతమే కాక భోగినీదండకం, వీరభద్రవిజయం, నారాయణ శతకం అనే గ్రంథాలను వ్రాశాడు.



పోతన భాగవతము ధారా శుద్ధికి, సహజములైన, రసమయములైన వర్ణనలకు భావనా శక్తికి పేరు పొందింది. భాగవతాన్ని అనువాదం చేసేటప్పుడు అతడు స్వతంత్రించి భక్తి రసమయములైన ఘట్టాలను పెంచాడు. అతడు దారిద్ర్యం అనుభవించినా భాగవతమును ఎవరికీ అంకితం చేయలేదు. తత్త్వదర్శిగా ఆత్మగౌరవంతో జీవితాన్ని గడిపాడు.

శ్రీమద్భాగవతంలో 12 స్కంధాలు ఉన్నాయి. అందు 5వ స్కంధము బొప్పరాజు గంగన, 6వ స్కంధం పర్చూరి సింగన, 11, 12 స్కంధాలు వెలిగందల నారయ్య వ్రాయగా మిగిలిన 8 స్కంధాలను బమ్మెర పోతనామాత్యుడు రచించినట్లు తెలుస్తోంది. రాచకొండను ఏలే సర్వజ్ఞ సింగ మహీపాలుడు భాగవత గ్రంథాన్ని తనకు అంకితమివ్వమని అడిగితే పోతన అందుకు అంగీకరించలేదు. పోతన సంస్కృత భాగవతాన్ని పఠించి విష్ణుభక్తిని

అలవరచుకున్నాడు. అతనికి సీతా సమేతుడై శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమై "శ్రీమద్భాగవతాన్ని తెలుగులో వ్రాయము"ని ఆనతి చేసి అంతర్హితుడైనాడు.

"నన్నయ్య, తిక్కన మొదలగువారు మహాభారతము మొదలగు ఇతిహాసములను తెలుగులో అనువదించినా శ్రీమద్భాగవతాన్ని ఆంధ్రీక రించలేదు దానిని నా కొరకు విడచిపెట్టినట్లున్నారు. ఇది నా పాలిట మహద్భాగ్యము. కనుక జన్మరాహిత్యమునకై భాగవతాన్ని తెలుగులో రచించి నా జన్మ సఫల మొనర్చుకొందును" అని,

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన తమ్మిచూలికైన
విబుధ జనుల వలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపఱతు.

"భాగవత విశేషాలను సమగ్రంగా వివరించటం బ్రహ్మకైనా, పరమ శివునికైనా అసాధ్యము. కావున వీటిని వివరించటానికి నేనెంతవాడను? నేను సజ్జనులతో తెలిసికొనిన వాటిని, చూచిన వాటిని, నా శక్తిని బట్టి తేట పరతును" ఈ పద్యంలో ఈ మహాకావి వినమ్రభావం ప్రస్ఫుటమవుతుంది.

కావ్యారంభంలో పరమశివునికి, బ్రహ్మకు ఇతర దేవగణాలకి మ్రొక్కులు చెల్లించి పిదప గణపతిని, సరస్వతిని వేనోళ్ళ స్తుతించాడు. దుర్గామాతకు, లక్ష్మికి ప్రణామాలు అర్పించాడు.

"నేను వాల్మీకి అంతటివాడిని కాను. వేదవ్యాసుని అంతటి వాడిని కానేకాను, కాళిదాసు మహాకవితో ఏ విధముగానూ పోలను. నన్ను భాగవత రచనలో ఎట్లు కృతార్థుని చేసెదవో ఈ భారము నీదే తల్లీ" అని భారతిని వేడుకున్నాడు.

- సశేషం

---

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## సెప్టెంబరు 3 నుండి 7 వరుకు శ్రీ కాళీవనాశ్రమ హైదరాబాదు శాఖ యందు జరిగిన వార్షిక సత్సంగ కార్యక్రమ దృశ్యములు







